ప్రజాశక్తి
గురువారం 2 నవంబర్ 2023
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి

ఎటు చూసినా కరువే...

- కనికరం ఏదీ?
- కరువు మండలాలను గుర్తించని ప్రభుత్వం
- అన్నదాతల ఆవేదన

ప్రజాశక్తి, అనకాపల్లి ప్రతినిధి

తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నా ప్రభుత్వం మాత్రం కరువు మండలాలను ప్రకటించడంలో జిల్లాను పూర్తిగా విస్మరించింది. వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోతున్నా రైతుల గోడు ప్రభుత్వానికి పట్టడంలేదు. దిగుబడులు తగ్గుతాయని వ్యవసాయ శాఖ నివేదికలు పంపినా గానీ ప్రభుత్వం వినిపించుకోలేదు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు, పంట నమోదు, ఎండుతున్న పంటల పరిస్థితిని ప్రభుత్వం ఏమాత్రం పరిగణనలోకి తీసుకున్నా సరే.. జిల్లాలోని కరువు మండలాలను ప్రకటించాల్సిన అనివార్య పరిస్థితి ఉంది. కానీ, సర్కార్ ఇవేవీ పట్టించుకున్నట్లు కనబడటంలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన కరువు మండలాల్లో జిల్లాను విస్మరించడం పట్ల రైతన్నలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో జూన్ 1 నుంచి అక్టోబర్ 31వరకు 895.9 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. కేవలం 634.4 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. సగటు వర్షపాతంలో –29 శాతం లోటు ఉంది. ఒక్క అక్టోబర్ నెలలోనే 214.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉన్నప్పటికీ.. కేవలం 30.8 మిల్లీమీటర్ల మేర మాత్రమే వర్షం కురిసింది. చీడికాడ మినహా మిగిలిన 23 మండలాల్లో 75 శాతానికి పైగా వర్షపాతం లోటు మిగతా 2లో..

అనకాపల్లిని కరువు జిల్లాగా ప్రకటించాలి : సిపిఎం

అనకాపల్లి జిల్లా కరువు జిల్లాగా ప్రకటించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన కరువు మండలాల్లో జిల్లాను విస్మరించడాన్ని తీవ్రంగా ఖండించారు. జిల్లాలో 24 మండలాలకుగాను 18 మండలాల్లో తీవ్రమైన కరువు పరిస్థితులు ఉంటే ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. కరువు మండలాల ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కొలబద్దలు ఏమిటో తెలియజేయకుండా ప్రకటించడం గర్హనీయమని పేర్కొన్నారు. కేంద్రం కరువు పరిశీలనా బృందాలను పంపి, ప్రకృతి వైపరీత్యాల నిధిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నగరపాలక సంస్థలో...

టిడిఆర్ బినామీల బాగోతం

- వెల్లువెత్తుతున్న అభ్యంతరాలు, ఫిర్యాదులు
- విజిలెన్స్ దర్యాప్తు కోరిన టిడిపి, జనసేన
- పరిశీలనకు అనుమతివ్వండి : గంగారావు
- కార్పొరేషన్ అధికారుల కినుక

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో

మహా విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) నుంచి కొంతమంది పలుకుబడి కలిగిన వ్యక్తులు, అధికార పార్టీ పెద్దలు ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్ (టిడిఆర్) పేరుతో రూ.వందల కోట్లు కొట్టేస్తున్నారు. అందుకోసం నేరుగా వారు లేదా వారి బినామీలను రంగంలోకి దించుతున్నారు. గడచిన కొన్ని నెలలుగా ఈ వ్యవహారం చిలికి చిలికి గాలివానగా మారింది. ప్రజా ధనాన్ని అధికార పార్టీకి చెందిన బడా నాయకులు, జిల్లా నాయకులు కొల్లగొడుతున్నారంటూ ఆధారాలతో సహా ప్రతిపక్షాలు ఎప్పటికప్పుడు ఫిర్యాదులు చేస్తున్నా జివిఎంసి అధికారుల్లో చలనం లేదు. జివిఎంసి ద్వారా ఇచ్చిన టిడిఆర్ అనుమతుల వివరాలు, డాక్యుమెంట్లను తన పరిశీలనకు ఇవ్వాలంటూ జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మను 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మంగళవారం కలసి వినతిపత్రం అందజేశారు. బుధవారం టిడిపి, జనసేన నేతలు మధురవాడ రేవళ్లపాలెంలో జివిఎంసి జారీచేసిన రూ.208కోట్ల విలువైన, సిరిపురం క్రైస్తవ భూములపై రూ.63కోట్ల విలువైన టిడిఆర్‌లపై సమగ్ర విచారణ చేయాలంటూ విజిలెన్స్ అడిషనల్ కమిషనర్ స్వరూపారాణికి వినతిపత్రాన్ని అందించారు. మధురవాడ, సిరిపురం తదితర ప్రాంతాల్లో టిడిఆర్ కుంభకోణాలు జరిగినట్లు రూఢి అవుతోంది.

నిబంధనలు ఏం చెబుతున్నాయి?

టిడిఆర్‌ల రూపంలో రాష్ట్రంలోని అధికార వైసిపికి చెందిన పలువురు నేతలు జివిఎంసి నుంచి రూ.వందల కోట్లు గుంజుకుంటున్నారన్నది అంతటా చర్చ సాగుతోంది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రూల్స్ 2020లో జారీచేసిన 180 జీవో ప్రకారం యజమాని నుంచి ముందుగా స్థల సేకరణకు అనుమతులు తీసుకుని టిడిఆర్ అనేది జారీచేయాల్సి ఉంది. ఆ స్థలాలు, ప్రదేశాల్లో అప్పటికే ఎలాంటి వివాదం ఉండకూడదు. రహదారుల నిర్మాణం పూర్తయిన తర్వాత అక్కడ భవనాలుంటే టిడిఆర్ ఇవ్వకూడదన్న నిబంధన ఉంది. అనుమతులు లేని ప్రైవేట్ లే–అవుట్లలో రహదారుల మిగతా 2లో..

పలు రైళ్లు రద్దు, మరికొన్ని రీషెడ్యూల్
వార్త 2లో..

రైలు ప్రమాద బాధితుల్లో ఇద్దరు డిశ్చార్జి
వార్త 3లో..

పాలస్తీనాపై దాడిని ఖండించండి
వార్త 6లో..

స్టీల్‌ప్లాంట్‌కు అంతర్జాతీయ అవార్డులు
వార్త 4లో..

తెలుగుతల్లి, పొట్టి శ్రీరాములు చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఘనంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం

ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని బుధవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేశారు. జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. వార్తలు లోపలి పేజీల్లో..

నేటి నుంచి ఐసిఐడి కాంగ్రెస్ సమావేశాలు

- ప్రారంభించనున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి
- అధికారులు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి– విశాఖపట్నం : ఇంటర్నేషనల్ కమిషన్ అండ్ ఇరిగేషన్ డ్రైనేజ్ (ఐసిఐడి) 25వ కాంగ్రెస్ సమావేశాలు గురువారం విశాఖలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో ప్రారంభం కానున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఈ సమావేశాలను ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసింది.

ముఖ్యమంత్రి ఉదయం 8:05 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 8:50 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 9:30 నుండి 11:00 వరకు ఐసిఐడి 25వ కాంగ్రెస్ సమావేశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.

ఏర్పాట్లు పరిశీలన

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్‌కుమార్, జివిఎంసి కమిషనర్ సాయి కాంత్ వర్మతో కలిసి బుధవారం పరిశీలించారు. రాడిసన్ బ్లూహోటల్‌ను మిగతా 2లో..

ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

1100 మందితో భద్రత : సిపి

ఎంవిపి.కాలనీ : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నగరంలో పర్యటించనున్న నేపథ్యంలో సుమారు 1100 మందితో భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. ఇక్కడికి వచ్చే పలు దేశాల ప్రతినిధులకు తగు భద్రతా ఏర్పాట్లు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. బందోబస్తును కేటగిరిలుగా విభజించి, ఒక్కొక్క విభాగానికి ఒక్కొక్క పోలీసు ఉన్నతాధికారిని పర్యవేక్షణాధికారిగా నియమించినట్లు తెలిపారు. నగరంలో వాహనాల రాక పోకలకు విఘాతం కలుగకుండా ప్రత్యేకంగా పోలీసు సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ఎటు చూసినా కరువే..

ఉంది. పొట్ట దశలో వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్న దుస్థితి నెలకొంది. అక్టోబర్‌లో నమోదైన వర్షపాతం చూస్తేనే జిల్లాలో నెలకొన్న దుర్భిక్ష పరిస్థితులను అర్థంచేసుకోవచ్చు. ఒక్క అక్టోబర్‌లోనే -85.6 శాతం వర్షపాతం లోటు ఉంది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 2,04,985 ఎకరాల్లో వివిధ పంటలు సాగు కావాల్సి ఉండగా.. కేవలం 1,35,095 (66 శాతం) ఎకరాల్లో మాత్రమే పంటలు సాగు నమోదైంది. ఈ మొత్తం విస్తీర్ణంలో వరి 1,36,460 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా.. 1,10,765 ఎకరాల్లో (81 శాతం) మాత్రమే నమోదైంది. వీటిలో 722 ఎకరాల్లో పంట ఎండిపోయినట్లు, దాదాపు 5వేల ఎకరాల్లో పంట వాడిపోయినట్లు వ్యవసాయ శాఖ అధికారులే గుర్తించారు. నానాపాట్లు పడి ఆలస్యంగానైనా వరినాట్లు వేసినా గానీ.. వర్షాభావ పరిస్థితులు వెంటాడుతుండటంతో ఆ పంట దిగుబడి గణనీయంగా పడిపోతుందని చెబుతున్నారు. జిల్లాలో తాండవ, రైవాడ, కోనాం, పెద్దేరు జలాశయాల కింద 75,414 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఆయకట్టుకు జలాశయాల నుంచి సాగునీటిని అందించలేకపోవడంతో 60,269 ఎకరాల్లో మాత్రమే వరి సాగుకు అవకాశం ఏర్పడింది. అంటే, జలాశయాల్లో నీరు సరిపడా లేకపోవడంతో సాగైన వరిపంటకు అందలేదు. దీంతో జలాశయాల ఆయకట్టు కింద సాగైన 60వేల ఎకరాల్లో 20వేల ఎకరాలకు పైగా వరి పంటకు సాగునీరు అందించలేక పొలాలు ఎండిపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో నక్కపల్లి మండలంలో 5,125 ఎకరాల్లో వరిసాగు కావాల్సి ఉండగా.. కేవలం 1,212 ఎకరాల్లో మాత్రమే రైతులు వరినాట్లు వేశారు. దీంట్లో కూడా సగానికి పైగా వరి ఎండిపోయింది. యలమంచిలిలో 5,510 ఎకరాలకు గాను 3,300 ఎకరాల్లో మాత్రమే వరిసాగైంది. రాంబిల్లిలో 6,815 ఎకరాలకు గాను 3,130 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు వేశారు. బుచ్చయ్యపేట మండలంలో 6,382 ఎకరాలకు గాను 4,505 ఎకరాల్లో, కె.కోటపాడులో 6065 ఎకరాలకు గాను 4,945 ఎకరాల్లో, పాయకరావుపేటలో 7,920 ఎకరాలకు గాను 2,855 ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు వేశారు. పంట వేసిన ఈ విస్తీర్ణంలో అత్యధిక భాగం పంట వర్షాల్లేక, నీటి తడి అందక కనీసం పశు గ్రాసానికి కూడా పనికిరాని విధంగా వరి ఎండిపోయింది. జిల్లా అంతటా దాదాపు ఇదే పరిస్థితి ఉంది. కనీసం రైతులు పెట్టిన మదుపులకు కూడా దిగుబడులు రాని దయనీయ పరిస్థితి నెలకొంది. కానీ, కరువుతో నష్టపోతున్న అన్నదాతల వాస్తవ పరిస్థితులను గుర్తించి మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి నివేదించి, కరువును గుర్తించేలా చేయడంలో వైఫల్యం చెందినట్లు కనబడుతోంది. అసలు, జిల్లాలో కరువే లేదన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరించిన తీరు పట్ల రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా తమ ఆవేదనను అర్థం చేసుకొని ఆదుకోవాలని అభ్యర్థిస్తున్నారు.

టిడిఆర్ బినామీల బాగోతం

కోసం వదిలేసిన స్థలానికి టిడిఆర్ వర్తించదు. కానీ నగరంలోని రేవళ్లపాలెంలో జివిఎంసి ఇలాగే టిడిఆర్ మంజూరు చేయడం చర్చనీయాంశమైంది. ఇంత జరుగుతున్నా ఏకపక్షంగా జివిఎంసి పాలకులు ముందడుగు వేస్తున్నారు మినహా చలించకపోవడంపై ప్రజా ఆగ్రహం వెల్లువెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నేటి నుంచి ఐసిఐడి కాంగ్రెస్ సమావేశాలు

సందర్శించి, సమావేశ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగే సమావేశాల నేపథ్యంలో నిర్వహణ పరమైన లోటుపాట్లు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇతర దేశాల నుంచి మంత్రులు హాజరుకానున్నందున మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ ఉమేష్ కుమార్, భీమిలి రెవిన్యూ డివిజనల్ అధికారి భాస్కర్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, కేంద్ర జల వనరుల శాఖ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మధ్యంతర బెయిల్‌పై హర్షం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : చంద్రబాబుకు మధ్యంతర బెయిలుపై టిడిపి విశాఖ పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షులు కెవి.స్వామి హర్షం వ్యక్తం చేశారు. టిడిపి జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబుపై అక్రమంగా కేసులు బలయించి, జైలులో పెట్టి వైసిపి నేతలు పైశాచిక ఆనందం పొందారన్నారు. మెయిన్ బెయిల్ కేసు వాయిదా 10న ఉందని, అప్పుడు కూడా బెయిల్ వస్తుందని భావిస్తున్నామన్నారు. బాబు మీద పెట్టినవన్నీ తప్పుడు కేసులేనని, వాటి నుంచి ఆయన బయట పడతారని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ లీగల్ సెల్ ప్రతినిధులు పతివాడ గిరిధర్, సి.ఉమాదేవి, కె.పార్థసారథి, ఎం.శోభన్‌బాబు, బత్తి రాజశేఖర్, డి.దుర్గాప్రసాద్, సుమతి తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు, మరికొన్ని రీషెడ్యూల్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రేక్ అందుబాటులో లేని కారణంగా 22831 హౌరా- శ్రీ సత్య సాయి ప్రశాంతి నిలయం ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 1న, 22808 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి ఏసీ ఎస్ఎఫ్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 2న రద్దు చేశారు.

రీషెడ్యూల్

ఈ నెల 1వ తేదీన 18464 కెఎస్ఆర్ బెంగళూరు - భువనేశ్వర్ ప్రశాంతి 4 గంటలు, 22503 కన్యాకుమారి - దిబ్రూగఢ్ వివేక్ ఎక్స్‌ప్రెస్ 3.35 గంటలు, 03358 కోయంబత్తూరు-బరౌని స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 3.55 గంటలు, 13352 అలప్పుజా-ధన్‌బాద్ బొకారో ఎక్స్‌ప్రెస్ 6 గంటలు, 18190 ఎర్నాకులం-టాటానగర్ ఎక్స్‌ప్రెస్ 19:45 గంటలు ఆలస్యంగా రీషెడ్యూల్ చేశారు. 13352 అలప్పుజా-ధన్‌బాద్ బొకారో ఎక్స్‌ప్రెస్ ఈ నెల 2వ తేదీన 4 గంటలు ఆలస్యంగా రీషెడ్యూల్ చేశారు.

తిరుపతి- హౌరా మధ్య వన్ వే ప్రత్యేక రైలు

వాల్తేరు డివిజన్‌లో అదనపు రద్దీని క్లియర్ చేయడానికి తిరుపతి-హౌరా మధ్య వన్ వే ప్రత్యేక రైలును నడపాలని రైల్వేశాఖ నిర్ణయించింది. 07163 తిరుపతి-హౌరా వన్ వే ప్రత్యేక రైలు ఈ నెల 3వ తేదీ రాత్రి 10.55 గంటలకు తిరుపతిలో బయలుదేరి 23:00 గంటలకు దువ్వాడ, 23:30 గంటలకు సింహాచలం, మరుసటి రోజు 13.25 గంటలకు హౌరా చేరుకుంటుంది. ఈ రైలు రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, బాపట్ల, తెనాలి, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, సింహాచలం నార్త్, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, బాలాసోర్, ఖరగ్‌పూర్ మార్గంలో ప్రయాణిస్తుంది. ఈ ప్రత్యేక రైళ్ల సేవలను ప్రజలు వినియోగించుకోవాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి కోరారు.

ఆర్‌టిసిలో 1/19 సర్క్యులర్ అమలు చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆర్‌టిసిలో 1/19 సర్క్యులర్‌ను తక్షణం అమలు చేయాలని ఎపిఎస్ఆర్‌టిసి నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సాయంత్రం విశాఖ ఆర్ఎం కార్యాలయాన్ని ముట్టడించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని డిపోల నుంచి కార్మికులు పాల్గొన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అసోసియేషన్ జోనల్ కార్యదర్శి ఎంవిఆర్.మూర్తి, రీజనల్ కార్యదర్శి బి.నీలకంఠం, జిల్లా చైర్మన్ వివిఎస్ఆర్.మూర్తి, డివిజనల్ కార్యదర్శి ఎకె.శివాజీ, పిపిఎం.రాజు హెచ్చరించారు. అధికారులు తమ అసోసియేషన్ సభ్యులపై చూపిస్తున్న పక్షపాతం విడనాడాలన్నారు. డిపో స్పేర్ నుండి లిస్ట్ అయిన వారిని అదే డిపోలో పోస్టింగ్ ఇవ్వాలని, ఓటి, డే అవుట్, ఎన్/ఒ అలవెన్సులు అదే నెలలో ఇవ్వాలని, ఓఆర్ తక్కువ వచ్చిందనే నెపంతో వేరొక డిపోకు బదిలీ చేయడం నిలుపుదల చేయాలని, ఇంక్రిమెంట్లు ఇప్పించాలని, టిటిఐల అక్రమ కేసులు రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ డిపో కార్యదర్శులు శంకరరావు, వసంతరావు, సాయిరాం, జెఎస్ఎన్.రాజు, ఎన్‌డి.బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్ఎంకు వినతిపత్రం సమర్పించారు.

గోకుల్ పార్కు అభివృద్ధికి శంకుస్థాపన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 29వ వార్డు పరిధి బీచ్ రోడ్‌లోని గోకుల పార్కును సుమారు రూ.78.61 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వార్డ్ కార్పొరేటర్ ఉరుకుటి నారాయణతో కలిసి మేయర్ గొలగాని హరివెంకటకుమారి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరానికి వచ్చే సందర్శకులు, పర్యాటకులకు ఆహ్లాదం కల్పించేందుకు తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఆర్‌కె బీచ్ వద్ద గోకుల్ పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ఎమ్మెల్యే గణేష్‌కుమార్ మాట్లాడుతూ, పరిపాలన రాజధాని అవుతున్న నేపథ్యంలో విశాఖ నగరానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కార్యనిర్వాహక ఇంజినీరు సత్యనారాయణ, ఇతర అధికారులు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్, ఎమ్మెల్యే

రైలు ప్రమాద బాధితుల్లో ఇద్దరు డిశ్చార్జి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విజయనగరం జిల్లా కంటకాపల్లి వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదంలో గాయపడి విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న నలుగురిలో ఇద్దరిని బుధవారం ఉదయం డిశ్చార్జ్ చేశారు. మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా సింగుపురం గ్రామానికి చెందిన మెహిదా వరలక్ష్మి, నరసన్నపేట మండలం సడగాం గ్రామానికి చెందిన గొట్ల కమలమ్మను డిశ్చార్జ్ చేసినట్లు ఆయన వెల్లడించారు. మిగిలిన ఇద్దరి ఆరోగ్యం కూడా మెరుగ్గా ఉందని, త్వరలోనే వారిని కూడా డిశ్చార్జ్ చేస్తామని తెలిపారు. రైల్వే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు రైల్వే ఉద్యోగుల ఆరోగ్యం నిలకడగా ఉందని రైల్వే అధికారులు తెలిపారు.

త్వరలో రిలయన్స్ ఎస్‌బిఐ కార్డు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎస్‌బిఐ, రిలయన్స్ రిటైల్ కో-బ్రాండెడ్‌తో కలిసి 'రిలయన్స్ ఎస్‌బిఐ కార్డ్'ను ప్రారంభించనున్నట్లు ఎస్‌బిఐ కార్డు ఎమ్‌డి అభిజిత్ చక్రవర్తి తెలిపారు. బుధవారం సిరిపురంలోని ఎస్‌బిఐ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ఈ కార్డు రిలయన్స్ రిటైల్ వారి ఫ్యాషన్, జీవనశైలి నుంచి కిరాణా సరుకుల వరకు, వినియోగదారు ఎలక్ట్రానిక్స్ నుంచి ఫార్మా వరకు, ఫర్నీచర్ నుంచి ఆభరణాల వరకు లావాదేవీలు జరిపినప్పుడు బహుమతులు ప్రయోజనాలను అందిస్తుందని చెప్పారు.

కోన్‌తో పరిశ్రమలో హై-స్పీడ్ టెస్టింగ్ సౌకర్యాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : భారతదేశంలో కొత్త ఎలివేటర్ టెస్టింగ్ టవర్, ల్యాబ్‌లతో టెస్టింగ్ స్టాండర్డ్‌లను ఎలివేట్ చేస్తున్నది కోన్ అని, కోన్ కార్పొరేషన్ ప్రెసిడెంట్, సిఇఒ హెన్రిక్ ఎర్న్‌రూత్ తెలిపారు. నగరంలోని ఒక హోటల్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ, పరిశ్రమలో ప్రముఖమైన హై-స్పీడ్ టెస్టింగ్ సౌకర్యాలు కల్పించనున్నామని తెలిపారు. కోన్ ఎలివేటర్స్ ఇండియా, కోన్ కార్పొరేషన్ పూర్తి యాజమాన్యంలోని అనుబంధ సంస్థ ఇది అన్నారు. టవర్, ల్యాబ్‌లతో సహ అత్యాధునిక రీసెర్చ్, డెవలప్‌మెంట్ ఎలివేటర్ టెస్ట్ సదుపాయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్త సౌకర్యం దేశంలోని కోన్ ప్రాంగణం చెన్నైకి సమీపంలోని శ్రీపెరంబుదూర్‌లో ఉందన్నారు.

టెస్ట్ టవర్ బహుళ షాఫ్ట్‌లను కలిగి ఉందని తెలిపారు. మొట్టమొదటి డిజిటల్‌గా కనెక్ట్ చేయబడిన ఎలివేటర్ అయిన కోన్ డిఎక్స్‌ను కలిగి ఉందన్నారు.

In the Honourable Court of the Mact-cum-I Addl District Judge : at Vizianagaram

M.V.O.P. No. 65/2023

Between :
Lothugadda Indraram ..Petitioner
And
Sai Simhadri Harish and another...Respondents

NOTICE

To :
R2 : O. Ashok Kumar S/o. Adinarayana, Hindu, Resident of D.No.24-7, Pithani Dibba, M.R.Peta, Visakhapatnam owner of Motor Cycle bearing No. AP12 N 7407.

Please take notice that the above case MVOP 65/2023 is stands posted to 8-11-2023 for notice to 2nd Respondent. You should appear in person or through an Advocate at 10.30 A.M. on the above said date in the above Court and if you fails to appear on the said date the above matter will be decided to exparte.

KARANAM SURYATEJ
B.COM, LLM
Advocate for the Petitioner
Vizianagaram

విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వాల్తేరు డివిజన్‌లో విజిలెన్స్ వారోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ అధికారులు, సిబ్బందిచే సమగ్రత ప్రతిజ్ఞ చేయించారు. వాల్తేరు డివిజన్‌లోని అన్ని రైల్వేస్టేషన్లు సబ్-డివిజనల్ యూనిట్లలో ఈ వారోత్సవాలలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు స్టేషన్లలో, వివిధ యూనిట్లలో, పబ్లిక్ ఇంటర్‌ఫేస్ ప్రాంతాలలో బ్యానర్లు, పోస్టర్లు ప్రదర్శిస్తారు. భద్రతా సందేశాన్ని ప్రచారం చేస్తారు. ఉద్యోగులకు సెమినార్లు, వ్యాసరచన, డిబేట్, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఎడిఆర్ఎం (ఇన్ఫ్రా) సుధీర్ కుమార్ గుప్తా, ఎడిఆర్ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్‌సాహూ, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మొహంతి పాల్గొన్నారు.

గ్రేహౌండ్స్‌లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : పోలీసుల అమరవీరుల దినోత్సవంలో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యాన పోలీస్ గ్రేహౌండ్స్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గ్రేహౌండ్స్ కమాండెంట్ ఆర్‌కె.మీనా హాజరై రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందించారు. ది పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖ జిల్లా కన్వీనర్, సామాజిక ప్రజా వైద్యులు డాక్టర్ కుప్పిలి సురేష్‌బాబు మాట్లాడుతూ, రక్తదానంపై ఎటువంటి అపోహలు అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శ్రీనివాసు, సౌజన్య, చైతన్య, ప్రియాంక, గ్రేహౌండ్స్ సభ్యులు పాల్గొన్నారు

సిపి రవిశంకర్‌కు బిసి నేతల అభినందనలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : విశాఖ పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్‌ను రాష్ట్ర బిసి సంఘం అధ్యక్షులు కేశన శంకరరావు, స్టడీ సర్కిల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇల్లా వెంకటేశ్వరరావు బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచి పరిపాలన అనుభవం ఉన్న అధికారి విశాఖ పోలీస్ కమిషనర్‌గా రావడం ఆనందంగా ఉందన్నారు. నగరంలో శాంతి భద్రతలు పర్యవేక్షణకు, దొంగతనాలను అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ చోడవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No: 149/2014 E.P. No 37/2022

కొల్లి వెంకటరావు ..D.Hr
మరియు
అడిగర్ల మల్లునాయుడు ...J.Dr

పై నెంబరు E.Pలో J.Dr చెల్లించవలసిన డిక్రీ బాకీ రాబట్టు నిమిత్తం D.H.R. అమలు చేయగా అందు నిమిత్తం పై కోర్టువారు ఈ క్రింది వివరించిన J.Dr యొక్క షెడ్యూలు ఆస్థిని **తే.06-11-2023దిన ఉదయం గం॥10.30ల నుండి సాయంత్రం 5.00 గంటలలోపు బహిరంగ వేలం వేయుదురు.** కావున ఎవ్వరైనా వేలంలో పాల్గొని షెడ్యూలు ఆస్తులని పాడుకోవలసినదిగా కోరడమైనది.

షెడ్యూలు

అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం, G.కొత్తపల్లి గ్రామం S.No: 143/4 నంబరు గల య.0-25ట్లు వారి మెట్టు భూమికి హద్దులు:
తూర్పు : వంటాకులు వారి తా॥తాటిపెండి,
దక్షిణం : కొల్లి దేముడు తా॥మెట్టు భూమి,
పడమర : అడిగర్ల అప్పలనాయుడు తా॥భూమి,
ఉత్తరం : బండి బాట.

D.H.R. విలువ: 1,00,000/-
అమీను విలువ: 3,00,000/-

కొల్లి శ్రీనివాసరావు,
అడ్వకేటు B.A., B.L
నాడు వీధి, చోడవరం,
చోడవరం, అనకాపల్లి జిల్లా,
01-11-23 సెల్: 9966224119.

పటిష్ట పరిశుభ్రతా చర్యలు చేపట్టండి

సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ

ప్రజాశక్తి- మధురవాడ : నగరంలో ఈనెల 2న ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి విశాఖ పర్యటన సందర్భంగా పటిష్ట పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ ఆదేవింఆచరు. బుధవారం సిఎం పర్యటన మార్గాలను, హెలీప్యాడ్‌ను పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ నెల 2 నుంచి 8 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ఇండియన్ నేషనల్ కమిటీ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న 25వ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజీ, 74 వ ఐఇసి మీటింగ్ ఆఫ్ ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ ప్రారంభోత్సవ కార్యాక్రమంలో పాల్గొనేందుకు గురువారం ముఖ్యమంత్రి జగన్ నగరానికి రానున్నారు.

సిఎం జగన్ పర్యట నేపథ్యంలో ఆయన పర్యటించే రోడ్డు మార్గాలలో, మధురవాడ ఐటీ సెజ్ హిల్-3లో హెలిపాడ్ ప్రదేశం నుంచి రాడిసన్ బ్లూహోటల్ వరకు ్న పరిశుభ్రతా కార్యక్రమాలను, ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు. పటిష్టమైన భద్రతతోపాటు ఏర్పాట్లులో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావుకు, సంబంధిత అధికారులకు కమిషనర్ ఆదేశించారు.

హెలీప్యాడ్ వద్ద ఏర్పాట్లపై సమీక్షిస్తున్న జివిఎంసి కమిషనర్

కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజనీర్ శాంసన్‌రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ బి. నరేష్‌కుమార్, 2వ జోనల్ కమిషనర్ కె. కనకమహాలక్ష్మి, చీఫ్ సిటీ ప్లానర్ సురేష్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ఎం. దామోదరరావు, ఎసిపి శాస్త్రి, ఎఇ శ్రీధర్ పాల్గొన్నారు.

సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- ములగాడ : పేరం గ్రూపు సంస్థ సహకారంతో, ఆసరా చారిటబుల్ సొసైటీ సమన్వయంతో జివిఎంసి 58వ వార్డు గుల్లలపాలెం, శ్రీహరిపురం వద్ద మహిళల సామాజిక భవన నిర్మాణానికి గ్రామ పెద్దలు పలపాల రఘు, సుజాత దంపతులు, ఆసరా ఛారిటబుల్ సొసైటీ ఇసి సభ్యులు బోణి శ్రీనాథ్, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఫౌండర్ డాక్టర్ కోరెడ్ల రమాప్రభ బుధవారం శంకుస్థాపన చేశారు కొన్నేళ్లుగా . ఐద్వా కార్యకలాపాలు నిర్వహిస్తున్న సామాజిక భవనం శిథిలావస్థకు చేరుకుని, నాలుగేళుగా వినియోగంలో లేని పరిస్థితుల్లో మహిళల కోసం సామాజిక భవన నిర్మాణానికి ముందుకొచ్చిన పేరం గ్రూపు సంస్థ, ఆసరా ట్రస్ట్‌కు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు మూడేళ్ల క్రితం ఆసరా ట్రస్ట్ అందించిన రూ.4లక్షల సాయంతో టైలరింగ్ సెంటర్‌ను మహిళలు, యువత శ్రమదానం, ఆర్థికతోడ్పాటుతో నిర్మించుకున్నారని మమత తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు పలపాల వర్మ, బర్రి మురళి, అంగ కనకలరావు, కర్రి కనకాకరాజు దంపతులు, తెప్పల నరసింగరావు, స్థానిక ఐద్వా కమిటీ అధ్యక్షులు జి. మమత, ఎం. నిర్మల, వరలక్ష్మి , కృష్ణవేణి, పోలమ్మ, ఈశ్వరమ్మ గిరిజా సువర్ణ అరుణ పాల్గొన్నారు.

రామవరం రోడ్డు నిర్మాణంపై హర్షం

శంకుస్థాపన చేస్తున్న నేతలు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గండిగుండం హైవే నుండి రామవరం వెళ్లే రోడ్డు నిర్మాణానికి బుధవారం స్థానిక సర్పంచ్ యర్ర పైడిరాజు ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు శంకుస్థాపన చేశారు. అధ్వానంగా ఉన్న రోడ్డు సమస్యను సర్పంచ్ పైడిరాజు స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి ఈ మేరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. రోడ్డు పనులు ప్రారంభం కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శోభన్‌బాబు సేవా సంఘం వార్షికోత్సవం

మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు సోములు

ప్రజాశక్తి -గోపాలపట్నం : 92 వ వార్డు గోపాలపట్నంలో నటభూషణ శోభన్‌బాబు సేవా సంఘం 16వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు నందవరపు సోములు మాట్లాడుతూ సినీ రంగంలో మంచి నడవడికను, ఆహ్లాదకరమైన ఆరోగ్యకరమైన వాతావరణాన్ని తీసుకువచ్చి, అభిమానుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మహా నటుడు శోభన్‌బాబు అని కొనియాడారు. సంఘం గౌరవ అధ్యక్షులు చందు సుబ్బారావు మాట్లాడుతూ, నందవరపు సోములు ఆధ్వర్యంలో ఆవిర్భంచిన శోభన్‌బాబు సేవాసంఘం, ఆయన జయంతి, వర్ధంతి సందర్భంగా అనేక సేవా సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ అభిమానాన్ని చాటుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పేదలకు దుస్తులు, విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.

సంప్రదాయబద్ధంగా దీపావళి

ప్రజాశక్తి-సీతమ్మధార : దివ్వెల పండుగ దీపావళిని సాంప్రదాయబద్ధంగా నిర్వహిద్దామని భారత కిసాన్ సంఘ్ జాతీయ నాయకులు జలగం కుమార్‌స్వామి పిలుపునిచ్చారు. బుధవారం ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో మాట్లాడుతూ ఆరోగ్యానికి హాని కలిగించే బాణాసంచాను, టపాసులు కాల్చవద్దని, డబ్బు, ఆరోగ్యాన్ని నాశనం చేసే పద్ధతికి స్వస్తి పలికాలని కోరారు.వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్‌కుమార్, నగర మిద్దె తోటలు సంఘం ప్రతినిధి ఎమ్ ఐశ్వర్య,గో ఆధారిత ప్రకృతి రైతుల సంఘం అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, సిహెచ్ మురళీధర్ పాల్గొన్నారు.

మన్మధరావు మృతి కార్మికవర్గానికి తీరని లోటు

మన్మధరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి -గాజువాక : రామచంద్రనగర్ రిక్షాకాలనీ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు మన్మధరావు మృతి వారి కుటుంబ సభ్యులకే కాక, కార్మిక వర్గానికి తీరని లోటని సిఐటియు గాజువాక జోన్ అధ్యక్షులు డి.రమణ అన్నారు. బుధవారం గాజువాక సిఐటియు కార్యాలయంలో మన్మధరావు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, కార్మికసంఘం బలోపేతానికి, మనుగడకు మన్మధరావు ఎన్నో సలహాలు,సూచనలు అందజేశారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో రాజారావు, అర్జునరావు, త్రినాధరావు, చిన్న, రాము పాల్గొన్నారు..

మాతృశ్రీ వృద్ధాశ్రమంలో గీతం విద్యార్థుల సందడి

ప్రజాశక్తి- మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులు సభ్యులుగా ఉన్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజనీర్స్ (ఐఇటిఇ) విద్యార్థి విభాగం బుధవారం స్థానిక వృద్ధాశ్రమంలో సందడి చేసింది. పిఎం.పాలెం మాతృశ్రీ వృద్ధాశ్రమంలో గీతం విద్యార్థులు రోజంతా గడిపి, వృద్ధులకు సేవలు చేయడంతో పాటు వారిని పలకరించి తామున్నామని భరోసా ఇచ్చారు. వారితో కలసి బోజనం చేశారు. వ్యక్తిగత సమస్యలను ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు

ఇఇసిఇ విభాగం అధిపతి డాక్టర్ జె.బి.సెవెన్త్‌లైన్, విద్యార్థి కోఆర్డినేటర్‌లు డాక్టర్ పి.రాజు, డాక్టర్ ఎస్.శారదరాణి, విజయకుమార్, డాక్టర్ మహ్మద్ కె.ఎమ్.చిష్టి పాల్గొని విద్యార్థులను అభినందించారు.

ఆశ్రమంలోని వృద్ధులతో గీతం విద్యార్థులు

మానసిక సమస్యలకు కౌన్సెలింగ్‌తో విముక్తి

గీతం సమావేశంలో నిపుణులు

ప్రజాశక్తి- మధురవాడ : చదువు, వృత్తిలో ఎదురయ్యే ఒత్తిళ్లను తట్టుకుని, మానసిక ఆరోగ్యంతో ముందుకు సాగాలంటే కౌన్సిలింగ్ అవసరమని నిపుణులు సూచించారు. బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం. స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ అప్లైడ్ సైకాలజీ విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ, వివిధ ఆకర్షణల ప్రభావానికిలోనై యువతరం విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. టీనేజ్‌లో మొబైల్ ఫోన్ వినియోగం, దురలవాట్లుకు దూరంగా, వ్యక్తిగత క్రమశిక్షణతో మెలగాలన్నారు. దుర్వసనాలకు ఒకసారి బానిసైతే, మానసిక ఒత్తిడి పెరిగి నైపుణ్యాలు సన్నగిల్లుతాయని, జీవితంలో ఎదుగుదలకు అవరోధంగా నిలుస్తాయన్నారు. గ్రీన్‌వేలీ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ ఉమారాజు మాట్లాడుతూ దేశంలో సరిహద్దు ప్రాంతాల ద్వారా నార్కో టెర్రరిజం వ్యాప్తి చెందుతోందని, యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. దీనిపై పోరాటానికి కేంద్ర ప్రభుత్వం 'నషాముక్త భారత అభియాన్' కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేస్తోందన్నారు. పోటీ ప్రపంచంలో కుటుంబ సభ్యుల నుంచి, సహ విద్యార్థుల నుంచి సహకారం అందక యువత దుర్వసనాల బారిన పడుతున్నారని, కౌన్సిలింగ్ ద్వారా 25 శాతం మంది తిరిగి సాధారణ జీవితం గడుపుతున్నారని తెలిపారు. హెచ్‌ఐవిపై పోరాడిన విధంగా మాదకద్రవ్యాల నుంచి విముక్తికి సమాజం వైపు నుంచి ప్రయత్నం జరగాలన్నారు.

గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఇన్‌ఛార్జి డీన్ ప్రొఫెసర్ బండి కామయ్య మాట్లాడుతూ ఆధునిక సమాజంలో వస్తున్న మార్పులే మానసిక సమస్యలకు కారణమన్నారు. కుటుంబ వ్యవస్థ నాశనం కావడం, యువతపై పర్యవేక్షణ లేకపోవడం స్వభావంలో మార్పు తెస్తూ మానసికంగా ఒంటరిని చేస్తున్నాయన్నారు ఒత్తిళ్ల నుంచి యువతను బయటకు తేవడానికి .ఉన్నత విద్యాలయాలలో కౌన్సెలర్ల అవసరం ఉందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డైరక్టర్ ప్రొఫెసర్ కె.చిన్నయసూరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అప్లైడ్ సైకాలజీ విభాగం అధిపతి డాక్టర్ కె.సునీత పాల్గొన్నారు. మానసిక ఆరోగ్యంపై విద్యార్థులు చేపట్టిన కార్యక్రమాల వివరాలతో పోస్టర్ ప్రదర్శన, వీధి నాటికలు, సంగీత, నృత్య ప్రదర్శనలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు.

నేరాలు ఘోరాలు

అత్తింటి వేధింపులకు వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి -పద్మనాభం: అత్తింటి శారీరక, మానసిక వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రేవిడి గ్రామంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పద్మనాభం సిఐ సన్యాసినాయుడు తెలిపిన వివరాలివి. మండలంలోని రేవిడి గ్రామానికి చెందిన బత్తల నాగలక్ష్మి(31) మంగళవారం రాత్రి తన ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. అత్తమామలతోపాటు భర్త సోదరులు పెట్టిన వేధింపులు తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడినట్లు మృతురాలి తల్లి ఉదయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మృతురాలికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నిత్యాన్నదానానికి వితరణ

ప్రజాశక్తి- సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గం ఆంధ్రజ్యోతి దినపత్రిక బిల్డింగ్ పక్కన జాతీయ రహదారి వద్ద ఎలిమేలి అయ్యప్ప అన్న సమారాధన సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మాల ధారణ భక్తులకు అందించే నిత్యాన్న దానానికి. వికెపిసిపిఐఆర్ యుడిఎ ఛైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మి వెంకటరావు రూ.65వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. తమ కుమారుడు చొక్కాకుల అనిల్ జన్మదినం సందర్భంగా నిత్యాన్నదాన ట్రస్ట్‌కు వితరణ అందించారు.. ఈ సందర్భంగా చొక్కాకుల లక్ష్మి వెంకటరావు, అనిల్‌సమీరా దంపతులకు ట్రస్ట్ సభ్యులు సత్కరించి, స్వామి ప్రసాదం అందజేశారు. అనంతరం ట్రస్టు సభ్యులను చొక్కాకుల దంపతులు అభినందించారు. కార్యక్రమంలో అక్కేన జగన్, సురేష్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

అన్నసమారాధనలో చొక్కాకుల

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆనందకుమార్

ప్రజాశక్తి -గోపాలపట్నం : 92వ వార్డు ఎస్‌సి,బిసి కాలనీలో సిసి రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మాణ పనులకు విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, జివిఎంసి కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ. 98.39 లక్షల జివిఎంసి నిధులతో ఎస్‌సి,బిసి కాలనీ, మేఘాద్రి గెడ్డ, అజంతా పార్క్, వుడా కాలనీ ఏరియాలలో కల్వర్టులు, సిసి రోడ్లు, డ్రెయిన్లు రిపేర్‌వర్క్‌లు చేపట్టనున్నారు..కార్యక్రమంలో 91, 92 వార్డుల వైసిపి అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, జి అప్పలస్వామినాయుడు, జెసిఎస్ మండల ఇన్చార్జి గేదెల మురళీకృష్ణ, కంపర కోటేశ్వరరావు, మల్లేటి భీమయ్య, బల్ల రమణ, సీరపు శంకరరావు, బలిరెడ్డి నాగేశ్వరరావు, ఎద్దు దేవుళ్లు, కంపర కనకరాజు, సాలాపు రమణ, కంపర రామకృష్ణ పాల్గొన్నారు.

పలుచోట్ల ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు

సీతమ్మధార : జివిఎంసి 14వ వార్డు మారుతీ నగర్ తమిళ్ కల్యాణ మండపంలో, 45వ వార్డు ఎన్జీవోస్ కాలనీ విద్యుత్ నగర్ యుపిహెచ్‌సిలో, 46వ వార్డు సంజీవయ్య కాలనీ అతిథి కల్యాణ మండపంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను నిర్వహించారు ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పాల్గొని, వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్, కటుమూరి సతీష్, కంపా హనోక్, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్ కుమార్ రాజు, కిరణ్ రాజు, పైడి రమణ, నీలి రవి, పీలా వెంకట లక్ష్మి, బి.గోవింద్, హరిపట్నాయక్, కె.చిన్నా పాల్గొన్నారు.

8న రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్

పలుచోట్ల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

స్టీల్‌ప్లాంట్ గేటు వద్ద పోస్టర్ల ఆవిష్కరణలో ఉక్కు నేతలు, విద్యార్థినేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 8న నిర్వహించతలబెట్టిన విద్యా సంస్థల రాష్ట్రవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి యువజన సంఘ ప్రతినిధులు పిలుపునిచ్చారు. బుధవారం కూర్మన్నపాలెం ఉక్కు రిలే దీక్ష శిబిరం వద్ద విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులతో కలిసి బంద్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో కన్వీనర్ జె అయోధ్యరామ్ మాట్లాడుతూ, ఉక్కు ఉద్యమంలో విశాఖ నగరంలోని ఒక విద్యార్థి కాల్పులలో మరణించారని గుర్తు చేశారు. కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు, విద్యార్థులు, యువజనులు కలసి ఉద్యమిస్తే ప్రభుత్వాలు దిగొచ్చి, విధానాలను మార్చుకోక తప్పద న్నారు. కమిటీ కోకన్వీనర్ నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలను అవహేళన చేసిన ప్రభుత్వాలను బంగాళాఖాతంలో కలిపిన చరిత్ర విద్యార్థి ఉద్యమానికి ఉందని స్పష్టం చేశారు. విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ, అన్ని రాజకీయ పార్టీల నేతలు 8న బంద్‌కు తమతో కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల ప్రతినిధులు యుఎస్ఎన్ రాజు, ఎల్‌జె నాయుడు, ఎస్ఎస్ పవన్, జై జాన్సన్‌బాబు, అభిలేష్, లెనిన్‌బాబు, అభిశ్రీ,ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు వైటి.దాస్, సిహెచ్ సన్యాసిరావు, బొడ్డు పైడిరాజు, డి సురేష్ బాబు, వరసాల శ్రీనివాస్, దాలినాయుడు, వి ప్రసాద్, శ్రీనివాస్, బంటు రాము, బ్లాస్ట్ ఫర్నెస్ కార్మికులు పాల్గొన్నారు.

చోడవరం : విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాల పిలుపులో భాగంగా నవంబర్ 8న కేజీ టూ పీజీ విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. చోడవరంలో ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో బుధవారం బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘ నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని, స్టీల్‌ప్లాంట్‌కి సొంతగనులను కేటాయించాలని, స్టీల్ ప్లాంట్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విభజన హామీలలో భాగంగా కడపలో ఉక్కు ఫ్యాక్టరీని నిర్మించాలన్నారు. 8న జరుగు బంద్‌కు విద్యాసంస్థలు, ప్రజలు తమ సంపూర్ణ సహకారాన్ని అందించాలని, విద్యార్థులు పెద్ద ఎత్తున బందులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్‌వి నాయుడు, పీడీఎస్‌ఓ జిల్లా నాయకులు సియ్యాద్రి రుద్రి, ఏ.మౌనిక, కె.నాగేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి.రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సుందర్, జగత్ తదితరులు పాల్గొన్నారు.

చోడవరంలో విద్యార్థి సంఘాల పోస్టర్ ఆవిష్కరణ

ఎన్ఎస్‌టిఎల్‌లో సెంట్రల్ జోన్ టేబుల్ టెన్నిస్ టోర్నీ ప్రారంభం

టోర్నీని ప్రారంభిస్తున్న ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్

ప్రజాశక్తి - కరాస: విశాఖపట్నంలోని నావల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబరేటరీ క్యాంపస్‌లోని పిచ్చయ్య ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ) సెంట్రల్ జోన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంటును బుధవారం ఎన్ఎస్‌టిఎల్ శాస్త్రవేత్త, డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ ప్రారంభించారు. డిఆర్‌డిఒ సెంట్రల్‌జోన్ పరిధిలోని తొమ్మిది లేబొరేటరీల క్రీడాకారులు ఈ టోర్నీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ హెచ్‌ఎం దాస్, ఎస్‌సిజి, బోని రమేష్‌బాబు, ఎన్ఎస్‌టిఎల్ సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ సిబ్బంది పాల్గొన్నారు

నేటి నుంచి స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపికలు

ప్రజాశక్తి -ఆనందపురం: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 2న సాఫ్ట్ టెన్నిస్ మాల్కం గేమ్స్‌కు సంబంధించి క్రీడాకారులు పెందుర్తి గవర్నమెంట్ హైస్కూల్‌లో రిపోర్ట్ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ కోరారు. అలాగే అండర్ -14 బాల,బాలికలకు ఈ నెల 3 న తైక్వాండో, సెలక్షన్ ట్రయల్స్ చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పివి నరసింహారావు ఫంక్షన్ హాల్ (ద్రోణంరాజు కల్యాణమండపం) లో జరుగుతాయన్నారు. అలాగే అండర్-17 బాల,బాలికలకు, 4న తైక్వాండో సెలక్షన్ ట్రయల్స్ జరుగుతాయన్నారు. విద్యార్థులు ఉదయం 8 గంటలకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు బోయపాలెం హైస్కూల్ పిడి ఎ.అప్పలరాజును 73863 54492, 82473 75914 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

స్టీల్‌ప్లాంట్‌కు మూడు అంతర్జాతీయ అవార్డులు

అంతర్జాతీయ అవార్డులు సాధించిన స్టీల్ క్వాలిటీ సర్కిల్ టీం

ప్రజాశక్తి- ఉక్కునగరం : బీజింగ్ లోని ఇంటర్నేషనల్ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్స్ కన్వెన్షన్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్ క్వాలిటీ సర్కిల్ టీం మూడు అంతర్జాతీయ బంగారు అవార్డులను అందుకుంది. గతనెల 30 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు చైనా అసోసియేషన్ ఆఫ్ క్వాలిటీ నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ క్వాలిటీ కంట్రోల్ కన్వెన్షన్‌లో విశాఖ స్టీల్ ప్లాంట్ క్వాలిటీ సర్కిల్ టీంలు టెస్లా రాకర్స్, అభ్యుదయ టీంలు అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచి, మూడు బంగారు అవార్డులను గెలుచుకున్నాయి. మెయింటెనెన్స్ అండ్ మిల్స్ సిజిఎం యు.శ్రీధర్, మేనేజ్‌మెంట్ సర్వీసెస్ డిజిఎం సంజయ్ రంజన్‌దాస్ ఆధ్వర్యంలో పలువురు క్వాలిటీ సర్కిల్ టీం సభ్యులు అవార్డులు గెలుచుకున్న బృందంలో ఉన్నారు. అంతర్జాతీయ స్థాయిలో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు మరోసారి అత్యుత్తమ అవార్డులు సాధించిన క్వాలిటీ సర్కిల్ బృందం సభ్యులను ఆర్ఐఎన్ఎల్ సిఎండి అతుల్ భట్ అభినందించారు.

రైలు ప్రమాద బాధిత కుటుంబాలకు పరిహారం

బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మేయర్

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇటీవల విజయనగరం జిల్లా కంటకాపల్లి వద్ద రైలు ప్రమాదంలో మృతి చెందిన ఆరిలోవ ప్రాంతానికి చెందిన మరిపి శ్రీనివాసరావు కుటుంబానికి రూ.10 లక్షల చెక్కును నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి అందజేశారు. అలాగే ఆరిలోవ హెల్త్‌సిటీ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పార్వతీపురం ఇందిరా కాలనీకి చెందిన కోలా నానాజీకి రూ.ఐదు లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ కార్యాలయం మండల రెవెన్యూ అధికారి ద్వారా అందజేసారు.

రాష్ట్ర అధ్యక్షుని దృష్టికి బిసిల సమస్యలు

శంకరరావును పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న రమణ

ప్రజాశక్తి- గాజువాక: విశాఖ జిల్లాలో వెనకబడిన కులాల ప్రధాన సమస్యలను బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు దృష్టికి తీసుకెళ్లినట్లు జిల్లా అధ్యక్షుడు పల్లా రమణ తెలిపారు. బుధవారం గాజువాక వచ్చిన శంకరరావును స్వాగతించిన రమణ, పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. బిసిల హక్కుల సాధన, జనగణనవంటి అంశాలపై పోరాడుతున్నట్లు శంకరరావు తెలిపారు. జిల్లాలో బిసి సంఘం బలమైన శక్తిగా ఎదగాలని, ఆ దిశగా బిసిలందరినీ చైతన్యపరచాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు

యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన లక్ష్యం

డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవంలో జిల్లా అధ్యక్షుడు రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు డివైఎఫ్ఐ ఉద్యమిస్తుందని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు, తెలిపారు. బుధవారం డివైఎఫ్ఐ 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎఎస్ఆర్ నగర్‌లో యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ పట్టణ జిల్లా అధ్యక్షులు ఎస్ఎన్. రాజు మాట్లాడుతూ, 1980లో పంజాబ్ లుధియానా నగరంలో అందరికీ విద్య ఉపాధి కావాలంటూ ఆవిర్భవించిన డివైఎఫ్ఐ, నేడు దేశంలోనే 2.10 కోట్ల సభ్యత్వంతో అతిపెద్ద యువజన సంఘంగా ఎదిగిందన్నారు. దేహం ముక్కలైనా, దేశాన్ని ముక్కలు కానివ్వమంటూ ఖాలిస్తాన్ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడి, అనేకమంది అమరులైన ఘనమైన చరిత్ర డివైఎఫ్ఐకి ఉందన్నారు. దేశ స్వాతంత్రం కోసం అసువులు బాసిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు, బిస్మిల్ ప్రసాద్‌వంటి త్యాగధనులు, ప్రముఖుల వారసత్వాన్ని, దేశభక్తిని యువతలో పెంపొందించడం కోసం వారి జయంతి, వర్ధంతుల సందర్భంగా అనేక సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, సెమినార్లు నిర్వహిస్తోందన్నారు. యువత చెడు మార్గం వైపు వెళ్లకుండా వారిని చైతన్యపరచడం, విద్య, ఉద్యోగావకశాలను అందిపుచ్చుకోవడంలో వారికి చేయూతనివ్వడం, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపైనా, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ఉద్యమించడం వంటి డివైఎఫ్ఐ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. శ్రావణ్‌కుమార్, జిల్లా నాయకులు దుర్గ, కోటి, రమణ పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ పతాకావిష్కరణలో యువజన నేతలు

అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్‌లో దినేష్ సత్తా

దినేష్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి -ఆనందపురం: గతనెల 23 నుంచి 28 వరకు చైనాలో జరిగిన అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్ పోటీల్లో వెల్లంకి గ్రామానికి చెందిన గొలగాన దినేష్ అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్ పెయిర్స్ విభాగంలో రజత పతకం సాధించాడు. 10 దేశాల క్రీడాకారులు పాల్గొన్న పోటీల్లో భారతదేశం నుండి పాల్గొన్న దినేష్ ఉత్తమ ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయిలో పతకం దక్కించుకోవడంపై హర్షం వ్యక్తమౌతోంది. ఈ మేరకు దినేష్‌ను స్థానిక ఎమ్మెల్యే ముతంశెట్టి శ్రీనివాసరావు, ఇతర వైసిపి నేతలు అభినందించారు. ప్రతిభ కనబరిచారు దినేష్ మరిన్ని అంతర్జాతీయ పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. కాగా ఎనిమిదేళ్లుగా జిల్లాస్థాయి నుండి జాతీయస్థాయి వరకు రోలర్ స్కేటింగ్‌లో పలు బంగారు పతకాలు సాధించిన దినేష్, ఇపుడు అంతర్జాతీయ స్థాయిలో రాణించడంపై హర్షం వ్యక్తమౌతోంది. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వెల్లంకి సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, వైసిపి నేతలు కాకర వెంకటరమణ, పిన్నింటి వెంకటరమణ , కంటి మహంతి చంద్రమౌళి, పడాల రాము, తోనంగి అప్పారావు రెడ్డి, దినేష్ తండ్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎపిసిసి ప్రధాన కార్యదర్శిగా మహేష్

ప్రజాశక్తి- తగరపువలస: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా జివిఎంసి ఒకటో వార్డుకు చెందిన గాదం మహేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు నియామక పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనను ఈ పదవిలో నియమించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

గాదం మహేష్

రోలర్ స్కేటింగ్‌లో అబిషా కళ ప్రతిభ

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఏడవ వార్డు స్వతంత్రనగర్‌కు చెందిన ఎస్ఎఫ్ఎస్.స్కూల్ విద్యార్థిని బి. అబిషా కళ జిల్లాస్థాయి అండర్-17 కేటగిరీ స్కేట్ బోర్డింగ్ విభాగంలో మంచి ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. విశాఖపట్నం డిస్టిక్ రోలర్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో 60 మంది క్రీడాకారులు పాల్గొనగా, అబిషా కళ పతకాన్ని కైవనం చేసుకుంది. విఎంఆర్‌డిఎ జాయింట్ కమిషనర్ వి.రవీంద్ర నుంచి పతకాన్ని స్వీకిరంచింది. అబిషాకళకు పతకం దక్కడంపై ఆమె తల్లిదండ్రులు బిఎంవి.ప్రసాద్ బాబు, శిల్ప దంపతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో కూడా ప్రతిభ చూపాలని గ్రామస్తులు ఆకాంక్షించి, అభినందనలు తెలిపారు.

పతకాన్ని సాధించిన కళ

'వెలుగు' చూస్తున్న అవినీతి

- రెండో రోజు కొనసాగిన విచారణ
- మహిళలపై బెదిరింపులకు దిగిన డిఆర్‌డిఎ పీడీ లక్ష్మీపతి

ప్రజాశక్తి- అనకాపల్లి

మండలంలోని సత్యనారాయణపురం గ్రామపంచాయతీలో జరిగిన డ్వాక్రా రుణాల పేరుతో వెలుగు సిబ్బంది చేసిన అవినీతి 2 కోట్లు నుంచి మూడు కోట్లు రూపాయలకు పైగా ఉంటుందని తెలుస్తోంది. తవ్వే కొద్ది అనేక కొత్త విషయాలు బయటపడుతున్నాయి. బుధవారం ఎన్‌ఓబి ఎస్‌డిసి (సబ్ కలెక్టర్) మనోరమ, డిఆర్డిఏ పిడి లక్ష్మీపతి, ఇతర అధికారులు రెండో రోజు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ప్రైవేట్ బ్యాంకులు నుండి డ్వాక్రా రుణాలకు అనుమతి లేనప్పటికీ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు నుంచి బినామీ డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసి లక్షల్లో రుణాలు కాజేశారు.

విచారణ సందర్భంగా బాధితురాలు బోడి నూక రత్నం మాట్లాడుతూ తాను హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఎలాంటి రుణాలు తీసుకోలేదని, ఎటువంటి సంతకాలు చేయనప్పటికీ తన పేరు మీద బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రూ.2 లక్షలు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో రూ.60 వేలు రుణం తీసుకున్నట్లు చూపిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన బాధిత డ్వాక్రా మహిళలు తమ ఆవేదనను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

డిఆర్‌డిఎ పీడీ బెదిరింపులు

ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎం.మాణిక్యం డ్వాక్రా మహిళల సమస్యలను వివరిస్తుండగా డిఆర్‌డిఎ పీడీ లక్ష్మీపతి బెదిరింపులకు దిగారు. ఐద్వా నేత మాణిక్యంను పోలీసులను పిలిచి అరెస్టు చేయిస్తానని బెదిరింపులకు దిగారు. బాధ్యతుల ఆవేదనను అర్థం చేసుకోకుండా పోలీసులతో అరెస్టు చేయిస్తానని పీడీ అనడంపై డ్వాక్రా మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ మహిళలు తమ సమస్యలను చెబుతుంటే పోలీస్‌లతో అరెస్టు చేయిస్తానని బెదిరించడం చూస్తుంటే ఈ కుంభకోణంలో అక్రమార్కులకు డిఆర్‌డిఎ పీడీ కొమ్ముకాస్తున్నట్లు కనిపిస్తుందని పేర్కొన్నారు. విచారణ సబ్ కలెక్టరు ఆధ్వర్యంలో జరుగుతుండగా, దానిని డిఆర్‌డిఎ పిడి లక్ష్మీపతి తప్పుదోవ పట్టిస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. దొంగలను అరెస్టు చేయడం చేతకాని పిడి మహిళలను అరెస్టు చేస్తామని బెదిరిస్తారా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఈ మొత్తం వ్యవహారంలో ఎవరి పాత్ర ఎంతో సమగ్రత విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ విచారణలో పాల్గొన్న బ్యాంకు అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరించారు. బాధిత మహిళలకు అధికారులు ఎటువంటి భరోసా కల్పించలేదు. దీంతో అనేకమంది మహిళలు కన్నీరు మున్నీరుగా తమ బాధలను, ఆవేదనను వెళ్ళగక్కారు. అయినప్పటికీ అధికారులు ఈ మొత్తం వ్యవహారంలో ఒక అవగాహన రావడానికి రెండు మూడు రోజులు పడుతుందని, తరువాత తగు చర్యలు చేపడతామని ప్రత్యేక విచారణ ఆధికారి మనోరమణి తెలిపారు.

డిఆర్‌డిఎ పీడీ బెదిరింపులపై నిలదీస్తున్న సిపిఎం, ఐద్వా నాయకులు

సాధికారిత యాత్ర పేరుతో మోసం : పైలా

ప్రజాశక్తి- కె.కోటపాడు : ఎస్టీ, ఎస్సీ, బీసీలను నిలువునా ముంచిన వైసిపి నేతలు సాధికారిత యాత్ర పేరిట ఆయా తరగతులను మోసం చేస్తున్నారని టిడిపి మాడుగుల నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు అన్నారు. మండలంలోని కింతాడ పంచాయితీ జోగన్నపాలెంలో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బూడి ముత్యాలనాయుడు కేవలం తారువ గ్రామానికి ఉప ముఖ్యమంత్రిగా మాత్రమే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. గురువారం మాడుగుల నియోజకవర్గంలో సాధికారత బస్సు యాత్రలో మాడుగుల నియోజకవర్గ సమస్యలపై మంత్రులను నిలదీస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కింతాడ మాజీ సర్పంచ్ బండారు నరసింహ నాయుడు, ఎ కోడూరు, సింగన్నదొర పాలెం సర్పంచ్‌లు బొడ్డు అక్కునాయుడు, వెలగల పైడంనాయుడు, రెడ్డి ప్రభాకర్, రెడ్డి సన్నిబాబు, గొలగాని రమణ, కర్రి నాయుడు, బొట్ట కోనారి పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్లకు విద్యుత్ పునరుద్ధరణ

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : రైతులకు విద్యుత్ శాఖ షాక్' పేరుతో ప్రజాశక్తి దిన పత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. మండలంలోని వడ్డాది ప్రాంతంలో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వడ్డాది, విజయరామరాజుపేట, కుముందానుపేట, మంగళాపురం తదితర గ్రామాల్లో వరి పంట పొలాల్లో నెర్రలు ఏర్పడడంతో రైతులు ఆందోళన చెందుతున్న విషయాన్ని ప్రజాశక్తి ప్రచురించింది. దీనికి స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు బుధవారం ఉదయం నుండి వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. యధావిధిగా విద్యుత్ సరఫరాను ఇవ్వడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎండిపోతున్న వరి పొలాలు

దిక్కుతోచని స్థితిలో రైతులు

ప్రజాశక్తి- కె.కోటపాడు

తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మండలంలో వరి పంట ఎండిపోతుంది. ఈ ఖరీఫ్ సీజన్లో అడపాదడపా కురిసిన వర్షాలకు కొంతమంది రైతులు వరి నాట్లు వేశారు. వరినాట్లు వేసేటప్పుడికి చెరువులు, గుంటలు, బావులాలలో నీరు ఉండగా వాటితోనే దమ్ములను పెట్టి నాట్లు వేశారు. వర్షాలు ఆశించినంత మేరకు ఈ ఏడాది కురవలేదు. అక్టోబర్ నెలలో వరుణుడు పూర్తిగా ముఖం చాటేశాడు. దీంతో పాటు ఎండలు కూడా వేసవి తలపించే విధంగా ఉండడంతో ఒక్కసారిగా చెరువులు, బావులు, గుంటల్లో నీరు ఇంకిపోయింది. దీంతో నీరు లేక వరి పొలాలు ఎండిపోతున్నాయి. ఎంతో ఆశతో పెట్టుబడి పెట్టిన రైతులు పంటను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. అయితే ఇప్పటివరకు చినుకు జాడ లేకపోవడంతో నాటిన వరి నాట్లు ఒకసారిగా ఎండిపోవడం మొదలుపెట్టాయి. వరి పొలాలకు పొట్ట దశలలో నీరు ఉండవలసిన అవసరం ఉంటుంది. కానీ నీరు లేకపోవడంతో పొట్ట దశలోని వరి పొలాలు ఎండిపోతున్నాయి. బోరు బావులు లేనిచోట ఈ పరిస్థితి ఏర్పడుతుంది. మండలంలో ఎక్కువ గ్రామాలలో బోరు బావులు లేకుండా ఉన్నాయి. ఆయా గ్రామాలలో నూతులు మీదే ఆధారపడి ఇప్పటివరకు వరి పంటలు పండిస్తున్నారు. బావుల మీద ఆధారపడి ఈ సీజన్లో వరి పంటలు నాటిన రైతులందరూ నిరాశ మిగిలే పరిస్థితులు ఉన్నాయి. కొద్ది రోజుల నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటున్నా చినుకు జాడ కనిపించలేదు. ఇదే పరిస్థితి కొనసాగినట్లయితే పంటలు ఎండిపోయే పరిస్థితి కనబడుతుంది. ఈ ఏడాది వరి సాగు తక్కువగా ఉండగా, సాగు చేసిన వరి కూడా కొంత క్రిమి కీటకాల బారినపడి నాశనమవుతుంది. మరోవైపు నీరు లేక ఎండిపోయే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎండిన వరి పొలాల పరిశీలన

కె.కోటపాడు : మండలంలోని 90 శాతం పైనే పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఈ దశలో కె.కోటపాడు మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించకపోవడం రైతులకు అన్యాయం చేసినట్లేనని ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షుడు రెడ్డి అప్పలనాయుడు అన్నారు. బుధవారం సిపిఐ మండల కార్యదర్శి గొర్లే దేవుడు బాబుతో కలిసి పలు గ్రామాల్లో పంటల స్థితిగతులను పరిశీలించారు. రైవాడ రిజర్వాయర్ ఆయకట్టు గ్రామాల్లో మినహా మిగిలిన గ్రామాల్లో పంటలన్నీ పూర్తిగా ఎండిపోయాయని తెలిపారు. పంట నష్ట వివరాలపై అధికారులు ఇచ్చిన నివేదికలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎండిపోయిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కరువు మండలంగా ప్రకటించాలని ధర్నా

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మునగపాక మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద బుధవారం రైతులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఎస్ బ్రహ్మాజీ మాట్లాడుతూ అప్పులు చేసి ఎకరానికి రూ.40వేలు పైచిలుకగా పెట్టుబడి పెట్టగా, వర్షాభావ పరిస్థితుల వల్ల పొలాలు పూర్తిగా ఎండిపోయి పశు గ్రాసానికి కూడా పనికిరాని విధంగా తయారయ్యాయని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాలలో పొట్ట దశకు వచ్చిన వరి పొలాలకు తెగుళ్లు సోకి చనిపోతున్న పరిస్థితులు దాపురించినట్లు చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని ఎడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు దాడి వీరునాయుడు, ఆడారి రామప్పలనాయుడు, పెదపాటి నాగేశ్వరరావు, బి గోవిందరావు, వి ముసలి నాయుడు, ఏ సూరప్పారావు, ఏఎస్ నాయుడు, ఏ రమణ బాబు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గిరిజనులు

సాగు భూములకు పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి-దేవరాపల్లి

గిరిజనులు, పేదలు సాగు చేస్తున్న బంజరు భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన బుధవారం, గిరిజనులు, పేదలు దేవరాపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న, మండల కార్యదర్శి బిటి దొర మాట్లాడూత మండలంలోని చింతలపూడి, తామరబ్బ, వాలాబు, గర్సింగి, వెంకటరాజుపురం గ్రామాల్లో గిరిజనులు, పేదలు సంవత్సరాలు తరబడి బంజరు పోడు భూములు సాగు చేసుకుంటున్నారని, వీరికి పట్టాలు ఇవ్వాలని అనేక సంవత్సరాలుగా దరఖాస్తులు పెట్టుకున్నా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు జగనన్న రీ సర్వే జరుగుతున్న నేపథ్యంలో పేదలు సాగులో ఉన్న భూములు సర్వే చేయడం లేదని, దీంతో పేదలు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సాగులో ఉన్న పేదలు,య గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే చింతలపూడి, గర్సింగి, వాలాబు తామారబ్బ పంచాయతీల్లో వీధి దీపాలు వెలగడం లేదని, వెంటనే వేయాలని కోరారు. అనంతరం తహశీల్దార్, ఎంపిడిఒకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బాధితులు జె.పొతురాజు, జె.ఈశ్వరావు, షేక్ అప్పాజి, యస్ బాబురావు, జి గురువులు, లక్ష్మణ, యస్ అర్జున్, రమణ, పిమహాలక్ష్మి, అధిక సంఖ్యలో మహిళలు, గిరిజనులు పాల్గొన్నారు.

ఆర్ఎంపి వైద్యుడు సూరిబాబు మృతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ఎర్రవాయి ప్రాంతంలో పేదల డాక్టర్‌గా పేరుందిన పెద్దమదీనకు చెందిన ఆర్ఎంపి వైద్యుడు ద్రాక్షారపు సూరిబాబు (సూరిబాబు డాక్టర్) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఎర్రవాయి ప్రాంతమైన పెద్దమదీనా, చిన్నమదీనా, గున్నెంపూడి, కొండపాలెం, చింతపాక సీతయ్యపేట తదితర గ్రామాల్లో డబ్బులతో ఎటువంటి సంబంధం లేకుండా సూరిబాబు వైద్య సేవలు అందించారు. వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురైన సూరిబాబు అకస్మాత్తుగా మృతి చెందారని కుటుంబీకులు తెలిపారు. సూరిబాబు కుటుంబానికి ఆర్ఎంపీ వైద్యులు యూనియన్ చోడవరం అధ్యక్షులు నిమిష కవి రాజు, ఏవి శ్రీకాంత్, ఈశ్వరరావు, యూనియన్ నాయకులు గోల్కొండ శ్రీనివాసరావు, గోల్కొండ రఘు సత్యనారాయణ, కే.గోపి, జంప శ్రీను, జంపా నాయుడు, జంపా బాలకృష్ణ, కే నాయుడు తదితరులు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సూరిబాబు (ఫైల్‌ఫోటో)

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.15 లక్షలు నాబార్డు నిధులతో వ్యవసాయ పంటలు నిలువ చేసుకునేందుకు గోదాము నిర్మాణానికి, గ్రామం నుండి వచ్చే మురుగునీరును శుద్ధిపరిచి నీటిని వినియోగించుకునే వాటర్ ప్లాంట్‌ను రూ.20 లక్షలతో నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం రామాలయం వద్ద ఐదు లక్షల రూపాయలతో స్టేజి నిర్మాణ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, స్థానిక సర్పంచ్ భవాని గణపతి నాయుడు, ఎంపీటీసీ వీరన్న, దామనపల్లి సర్పంచ్ నాగేశ్వరరావు, నాగబాబు, భూతనాథ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంపై వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం ఆయుర్వేద కేంద్రం ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులకు ఆయుర్వేదంపై బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రామ్ ప్రసాద్ చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య అధికారి లావణ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రీకృత ప్రజా పరీక్ష కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ పథకం కింద సుమారు కోటి రూపాయలతో మంజూరు చేసి నిర్మించబడిన కేంద్రీకృత ప్రజా ఆరోగ్య పరీక్షా కేంద్రాన్ని బుధవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో బయాలజికల్ సంబంధించిన పరీక్షలు జిల్లా ఆసుపత్రిలో లభించేవి కావని, టెస్టుల నిమిత్తం ప్రజలు కేజీహెచ్‌కు వెళ్లవలసి వచ్చిందని, ఈ సెంటర్ నిర్మాణం ద్వారా ఇకమీదట టెస్టులని మన అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో లభ్యమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి సుభాష్ పటాన్ శెట్టి, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లె సూరిబాబు, అనకాపల్లి జిల్లా ఆస్పత్రి కమిటీ సభ్యులు డాక్టర్ రామ్మూర్తి, రత్నకుమారి, మురళీకృష్ణ, వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, నాయకులు డాక్టర్ కె విష్ణుమూర్తి, డిఎంహెచ్వో డాక్టర్ హేమంత్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పెదముషిడివాడలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని పెదముషిడివాడ గ్రామపంచాయతీలో శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజు బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. జగనన్నే మా భవిష్యత్తు సంక్షేమ యాత్ర నక్కవానిపాలెం, పచ్చిగోరివాని పాలెం, గండివానిపాలెం గ్రామాల్లో చేపట్టి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు, గండివానిపాలెం గ్రామంలో భారీ గజమాలతో ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపిపి పైలా వెంకట పద్మశ్రీనివాస్, జెడ్పిటిసి పిఎస్ రాజు, పాల్గొన్నారు.

జాతీయ క్రీడలలో పతకాలు సాధించాలి

ప్రజాశక్తి - పరవాడ : గోవాలో జరుగుతున్న 37వ ఎడిషన్ ఇండియన్ ఒలింపిక్స్‌గా పిలిచే నేషనల్ గేమ్స్‌లో పతకాలు సాధించాలని సంస్కృతి గ్లోబల్ స్కూల్ చైర్మన్ పి సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఈ క్రీడల్లో పెంటథ్లాన్ స్విమ్మింగ్, రన్నింగ్, షూటింగ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సంస్కృతి గ్లోబల్ విద్యార్థులు స్మృతిణి ప్రాధాన్, శిఫా పాతిమాలను బుధవారం ఆయన అభినందించారు. సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో విద్యతో పాటు విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి బహుముఖ కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్ సీతలక్ష్మి, సీఈఓ కె.నిశంత్, కోఆర్డినేటర్ రామలక్ష్మి, స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు, కోచ్‌లు హరినాథ్ రెడ్డి, మనీష్, బషీర్, రాజేష్ పాల్గొన్నారు.

అంతర్ జిల్లా పోటీలకు విద్యార్థినుల ఎంపిక

ప్రజాశక్తి - యలమంచిలి : నెల్లూరు జిల్లా ఆత్మకూరులో నవంబర్ 4 నుంచి మూడు రోజులపాటు జరిగే అంతర్ జిల్లా బాల్ బాడ్మింటన్ పోటీలకు స్థానిక కొత్తపేట జిల్లా పరిషత్ హైస్కూల్ కోచింగ్ క్యాంపులో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం. వై.వి.రమణ బుధవారం తెలిపారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు వెంకట్రావు, సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, చంద్రశేఖర్, కో-ఆప్షన్ వార్డు మెంబరు దూది నరసింహమూర్తి పోటీలకు సంసిద్ధం చేశారని తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో అర్జాపురం, వాడచీపురుపల్లి, గోపాలపట్నం, ఎఎస్‌పేట, గోవాడ, స్థానిక కొత్తపేట, పరవాడ, పాములవాక మొదలైన ఉన్నత పాఠశాలల నుంచి క్రీడాకారులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు కె.వి.రమేష్‌నాయుడు, ఎం.తులసీ సత్యవతి పాల్గొన్నారు.

'మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద భూకబ్జాకోరు'

ప్రజాశక్తి-అనకాపల్లి : భూములను కబ్జా చేయడంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దిట్ట అని ఎంపిపి గొర్లె సూరిబాబు ఆరోపించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌పై మాజీ ఎమ్మెల్యే పలు భూ ఆరోపణలు చేయడం దారుణమన్నారు. టిడిపి హయాంలో అనకాపల్లి నియోజకవర్గంలో వందలాది ఎకరాలు దోచుకోవడం, క్వారీల కమీషన్లు, ఏపీఐఐసీ కుంభకోణాల అవినీతి విషయంలో గోవింద సత్యనారాయణపై 420 కేసు నమోదైందని చెప్పారు. సమావేశంలో వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, పలువురు ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.

జెర్సీ పాల సేకరణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని తోటాడ గ్రామంలో నూతనంగా గోద్రెజ్ జెర్సీ పాల సేకరణ కేంద్రాన్ని బుధవారం డెయిరీ జోనల్ ఇంచార్జ్ గోవిందరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ మేనేజర్ సాయిప్రసాద్, సుధాకర్ రెడ్డి, సురేష్, ప్రవీణ్, గ్రామ ప్రతినిధులు ఆళ్ళ బాబు, త్రినాథ్, కర్రి జగదీష్,పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఖండించండి

ప్రజా సంఘాల ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి- అనకాపల్లి

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఖండిస్తూ ప్రపంచ శాంతిని కాపాడాలని కోరుతూ బుధవారం అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ 1947కి ముందు ఇజ్రాయిల్ అనే దేశమే లేదని, పాలస్తీనాలో ఆశ్రయం పొందడానికి వచ్చిన ఇజ్రాయిల్ నేడు పాలిస్తీనా మొత్తాన్ని ఆక్రమించి, నేడు ప్రపంచ పటంలో పాలస్తీనా అనే దేశమే లేకుండా చేసిందని పేర్కొన్నారు. అటువంటి దుర్మార్గమైన ఇజ్రాయిల్ 7,000 మంది పాలస్తీనా పౌరులు పొట్టన పెట్టుకుందని, వారిలో8 4000 మంది పసిపిల్లలు, మహిళలు ఉన్నారని తెలిపారు. ఐక్యరాజ్యసమితి తీర్మానానికి ఇజ్రాయిల్ కట్టుబడి ఉండలేదని, ఇజ్రాయిల్ యుద్ధానికి అమెరికా, బ్రిటన్ వంటి సామ్రాజ్యవాద దేశాలు మద్దతు తెలుపుతున్నాయని చెప్పారు. యుద్ధం ద్వారా తమ ఆయుధాలను అమ్ముకొని లబ్ధి పొందాలని అమెరికా భావించడం సరికాదన్నారు. తక్షణమే ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపి శాంతికి కట్టుబడి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివాజీ, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్. శంకరరావు, కోశాధికారి వివి.శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా నాయకులు గంటా సుభాషిణి, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అల్లు రాజు, గొర్రెల మేకల పెంపకదారుల సంఘం జిల్లా చైర్మన్ గంట శ్రీరామ్, ఈశ్వరరావు, నూక అప్పారావు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు

ప్రజా రక్షణ భేరిపై ప్రచారం

ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు రాము తదితరులు

ప్రజాశక్తి అచ్యుతాపురం

అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు బుధవారం మండలంలోని దోసూరు, అచ్యుతాపురంలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఆర్ రాము, నాయకులు కె.సోమునాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లో బస్సు యాత్రలు ప్రారంభమయ్యాయని, ముగింపు సందర్భంగా ఈ నెల 15న విజయవాడలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశామని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా మందస నుండి ప్రారంభమైన బస్సు యాత్ర 5వ తేదీన అచ్యుతాపురం వస్తుందని, ఇందులో ప్రజలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రం విడిపోయి పదేళ్ళ అవుతున్నా ఇప్పటికీ విభజన హామీలు ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, విశాఖ రైల్వే జోన్, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, కేంద్ర విద్యా సంస్థల ఏర్పాటు వంటి హామీలు ఏ ఒకటి అమలు కాలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిన బిజెపి, అంతటితో ఆగకుండా రాష్ట్రానికి గుండెకాయ లాంటి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిందన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన మోడీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రమేష్, రాజు, అప్పలనాయుడు, పైడిరాజు, రాజునాయుడు, ప్రసాదు అన్నంరాజు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

పరవాడ : సిపిఎం ప్రచార భేరి బస్సుయాత్ర వాల్ పోస్టర్లను స్థానిక తహశీల్దారు కార్యాలయ జంక్షన్‌లో బుధవారం సిపిఎం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు వివి రమణ, మండల నాయకులు పి మాణిక్యం, చిన్ని కిషోర్ మాట్లాడుతూ రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపికి రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు వత్తాసు పలకడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, వరలక్ష్మి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని నరసింగపల్లిలో ప్రజా రక్షణ భేరి గోడపత్రికను కార్మికులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు పరచడం వలన కార్మికులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో లోకేష్, మానేరావు, రాంబాబు, రమణ, త్ర పోలయ్య, దాకారపు శ్రీనివాసరావు, డి.డి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: ఈనెల 15న సిపిఎం ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించే ప్రజారక్షణభేరి సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నేతలు కోరారు. బుధవారం జివిఎంసి 74వ వార్డు వెంపలనగర్‌లో ప్రజారక్షణభేరికి సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజారక్షణభేరి యాత్ర, సభలో పాల్గొనాలని కోరుతూ కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో బైరెడ్డి గురప్ప, పాల అప్పలరెడ్డి, ఎస్.దేముడు, పాల వెంకయ్య, హెచ్.భానోజీరావు, నందికి వీరారెడ్డి, గొరుసు శ్రీనివాసు పాల్గొన్నారు.

28న చంద్రబాబు మళ్లీ జైలుకు వెళ్లాల్సిందే

- రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి- అనకాపల్లి

చంద్రబాబునాయుడుకి బెయిల్ వచ్చిందని సంబరాలు ఎందుకు జరుపుకొంటున్నారో తనకు అర్థం కావటం లేదని, ఈ నెల 28న మళ్లీ ఆయన రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్లాల్సిందేనని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. బుధవారం అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గొల్లవిల్లి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరణ సభలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు కంటి ఆపరేషన్ చేయించుకోవడం కోసం మాత్రమే బెయిల్ ఇచ్చారన్నారు. 371 కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కాజేశాడు కాబట్టే చంద్రబాబును అన్ని రోజులు పాటు జైల్లో ఉంచారని పేర్కొన్నారు. చంద్రబాబుకు కేవలం నవంబర్ 27వ తేదీ వరకు మాత్రమే బెయిల్ ఉందని 28వ తేదీ సాయంత్రం తిరిగి ఆయన రాజమండ్రి సెంట్రల్ జైల్లో సరెండర్ కావాల్సిందేనని మంత్రి అమర్నాథ్ తెలిపారు.

అనకాపల్లి మార్కెట్ కమిటీ ఖ్యాతిని పెంచాలి

అనకాపల్లి బెల్లం మార్కెట్ ఖ్యాతిని మరింతగా పెంచాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆకాంక్షించారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గొల్లవిల్లి శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ ఆవరణలో జరిగిన సభలో మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద మార్కెట్ యార్డులలో అనకాపల్లి మార్కెట్ యార్డు రెండవ స్థానంలో ఉందని చెప్పారు. దేశవ్యాప్తంగా చెరకు దిగుబడి తగ్గిపోవడం వలన బెల్లం వ్యాపారం ఆందోళనకరంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, ఎంపీ సత్యవతి, పట్టణ పార్టీ అధ్యక్షుడు జానకిరామరాజు ఏఎంసీ డైరెక్టర్లు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు సన్మానం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండల తహశీల్దారుగా పనిచేస్తూ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన కె.వెంకటేశ్వరరావును మంగళవారం రాత్రి రెవెన్యూ సిబ్బంది ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఉద్యోగ జీవితంలో ఆయన చేసిన సేవలే గుర్తుండిపోతాయని వక్తలు పేర్కొన్నారు. మండల నాయకులు దాకారపు నాగరాజు, రావికమతం తహశీల్దార్ ఉమామహేశ్వరరావు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అరుణ్ చంద్రకు అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట తహశీల్దారు వెంకటేశ్వరరావు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన నేపథ్యంలో డిప్యూటీ తహశీల్దార్ అరుణ్ చంద్రకు తహశీల్దారుగా అదనపు బాధ్యతలు జిల్లా అధికారులు అప్పగించారు. ఈ మేరకు బుధవారం అరుణ్‌చంద్ర బాధ్యతను స్వీకరించారు.

ఉమెన్ సేఫ్టీ పరికరం రూపకల్పన

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ కళాశాల 2వ సంవత్సరం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థినులు ఉమెన్ సేఫ్టీ పరికరాన్ని రూపొందించారు. గుడివాడ తులసీ దేవి,పెంటకోట ధన దీపిక, జంపాన తేజశ్రీ, ఉమెన్ సేఫ్టీ పరికరాన్ని రూపొందించారు. చిన్న సైజులో ఉండే ఈ పరికరం మహిళలు పాకెట్ లేదా హ్యాండ్ బ్యాగ్‌లలో క్యారీ చేయవచ్చని ప్రాజెక్ట్ ఇంజనీర్ బి. శేషగిరి రావు తెలిపారు. ఈసిఈ విభాగాధిపతి డాక్టర్ పి. పూర్ణ ప్రియ పాల్గొన్నారు.

81వ వార్డులో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసి 81వ వార్డు, గవరపాలెంలో దేముని గుమ్మం, వేగి వారి వీధి ప్రాంతాలలో బుధవారం రాష్ట్ర బీసీ సాధికార కన్వీనర్ మళ్ల సురేంద్ర ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ - ఇది బాబు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పీల గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాధంశెట్టి నీలబాబు, సబ్బవరపు గణేష్, కొణతాల రత్న కుమారి, దనాల విష్ణు చౌదరి, కాయల ప్రసన్న లక్ష్మీ, హేమా, భారతీ, సత్యవతి, జనసేన నాయకులు శ్రీరామదాసు గోవిందరావు, పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి ఆడపిల్ల అవసరం

ప్రజాశక్తి -అనకాపల్లి : సమాజం అభివృద్ధి చెందాలంటే ఆడపిల్లల అవసరం ఎంతైనా ఉందని, దానిని ప్రతి ఒక్కరూ గుర్తించాలని డివిజనల్ రెవెన్యూ అధికారి ఏ.చిన్నికృష్ణ అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో గర్భస్థ పిండ పరీక్షల నిరోధం, పిసి పిఎన్ డిటి చట్టంపై అమలుపై బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో ఉన్న మూఢనమ్మకాలు, ఆడపిల్లల పట్ల వివక్షత కారణంగా బాల బాలికల లింగ నిష్పత్తిలో ఎక్కువ తేడాలు వస్తున్నాయన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన డాక్టర్‌కు రూ.50 వేలు జరిమానాతో పాటు మూడు నెలల జైలు శిక్ష కూడా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఎడిఎంహెచ్ఓ డాక్టర్ బాలాజీ, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ వై.మురళీధర్, ఎపీపీ మృణాళిని, డిపిఆర్ఓ డి.సాయిబాబా, సమిధ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు వీరభద్రరావు, హెల్త్ ఎడ్యుకేటర్స్ శివరామకృష్ణ లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

చెట్లు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక సుంకర మెట్ట జంక్షన్ వద్ద ఉన్న సత్యనారాయణ స్వామి దేవస్థానం ఆవరణలో 50 సంవత్సరాల నుంచి ఉన్న మూడు భారీ వృక్షాలను ఈవో ఆదినారాయణ ఎటువంటి అనుమతులు లేకుండా తొలగించడం పట్ల ఉత్తరాంధ్ర చర్చ వేదిక నాయకులు బుద్ధ రాజేష్ ఆక్షేపించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మార్వో, అటవీ శాఖ, మున్సిపల్ శాఖ అధికారుల అనుమతి లేకుండా భారీ వృక్షాలను నరికి వేసి, ఆ కలపను విక్రయించారని, దీనిపై దేవాదాయ శాఖ కమిషనర్ దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టిడిపి నేతల ప్రచారం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్‌పురం, కృష్ణదేవిపేట గ్రామాల్లో బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని మాజీ జెడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ, ప్రతి ఇంటింటికి వెళ్లి చంద్రబాబు విడుదల చేసిన మినీ మేనిఫెస్టోలో పథకాలను వివరించడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో యువతకు ఉద్యోగ అవకాశాలు, వ్యవసాయ అభివృద్ధి టిడిపితోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాడుగుల: బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు గవిరెడ్డి రామానాయుడు పాల్గొన్నారు. బుధవారం మాడుగుల మండలంలోని గిరిజన గ్రామాలైన జాలంపల్లి, బుట్టల జాలంపల్లి, కొత్తపల్లి గ్రామాలలో బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో రామనాయుడు పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. అధికారంలోకి వస్తే తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చే పథకాలను వివరించారు. ఈ కార్యక్రమం లో జాలంపల్లి నాయకులు మాజీ ఎంపీటీసీ బాణం భీమలింగేశ్వరావు, గోవిందా, కోన చంటి, పల్లా చిన్న, దాసు,రాజు, వర్మ,తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారం చేపడుతున్న రామానాయుడు

పల్లెనిద్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న పల్లెనిద్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైస్ ఎంపీపీ దత్తుడు రాజు కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వైసీపీ మండల అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల తొమ్మిది నుంచి ప్రారంభం కానున్న పల్లెనిద్ర కార్యక్రమం పై స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు ఈనెల 3న షెడ్యూల్ ప్రకటిస్తారని, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైస్ ఎంపిపి దత్తుడు రాజు

పుస్తకాలు పంపిణీ చేస్తున్న నరసింహమూర్తి

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-రోలుగుంట:అనకాపల్లి చెందిన పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ కర్త పిరాట్ల నరసింహమూర్తి బుధవారం రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 380 మందికి నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం నరసింహమూర్తి మాట్లాడుతూ, అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తు ఉంటామని, ఇందులో భాగంగా ఈ పాఠశాలలో విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు అందించామన్నారు. అనంతరం పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రపై క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరామ్మూర్తి, శర్మ, రమాకుమారి, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

ప్రజాశక్తి -యంత్రాంగం:

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం అనకాపల్లి, విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘనంగా నివాళు లర్పించారు.

అనకాపల్లిలో నివాళి అర్పిస్తున్న కలెక్టర్

అనకాపల్లి:ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా ఏర్పాటైన తరువాత అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, డిఎంహెచ్ఒ డాక్టర్ ఏ హేమంత్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ మురళీకృష్ణ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏఆర్ డిఎస్పీ పి.నాగేశ్వరరావు, ఏఓ బి.శారద పాల్గొన్నారు.

టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీకన్యకా పరమేశ్వరి జంక్షన్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఘనమైన నివాళు లర్పించారు. నాయకులు డాక్టర్ కేకేవిపి నారాయణరావు, బోడి వెంకట్రావు గుడాల సత్యనారాయణ విల్లూరి రమణబాబు పాల్గొన్నారు.

నక్కపల్లి:ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములని ఎంపీపీ రత్నం అన్నారు.మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.వైస్ ఎంపీపీ నానాజీ, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో సీతారామరాజు, ఈఓపిఆర్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

మండలంలోని పెదబోదిగల్లం హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు సిహెచ్.సత్యనారాయణ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.వి.ఎన్.ఆచార్యులు, ఫల్గుణరావు, కుమారి, రమేష్ బాబు, చిన్నారావు, శ్రీదేవి పాల్గొన్నారు.

కోటవురట్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం మండల తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తహసిల్దార్ జానకమ్మ ఆధ్వర్యంలో సిబ్బంది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ తహసిల్దార్ సోమశేఖర్, సీనియర్ అసిస్టెంట్ గణపతి రావు పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక శాఖ గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఓ.శ్రీనివాసరావు, అంబేద్కర్ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామంలో గంట యువసేన ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలగా సోమేశ్వరరావు, షేక్ బాబార్, ఉల్లింగల రమేష్, జెర్రిపోతుల నూకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : ఆంధ్రరాష్ట్ర అవతరణకు ప్రాణత్యాగం చేసి అమరజీవి పొట్టి శ్రీరాములు కృషి భావితరాలకు స్ఫూర్తిదాయకమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. బుధవారం ఎండాడలోని వైసిపి కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జి రవిరెడ్డి, నడింపల్లి కృష్ణంరాజు, ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ విజయచందర్, పిల్లా సుజాత సత్యనారాయణ, మారుతి ప్రసాద్, అల్లంపల్లి రాజుబాబు, బెందాలం పద్మావతి, కే రామన్న పాత్రుడు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు పూలమాల వేసి నివాళు లర్పించారు.బాణాల శ్రీనివాసరావు, కె.అనిల్ కుమార్‌రాజు,సాడి పద్మారెడ్డి, సారిపల్లి గోవింద్, ఆళ్ళ లీలావతి, వావిలపల్లి ప్రసాద్, కెవియన్ శశికళ, సేనాపతి అప్పారావు, పిల్లి సుజాత, ఆళ్ల శివ గణేష్, కృష్ణారావు, బులుసు జగదీశ్, అమర్ రెడ్డి, వసంత అప్పారావు, శ్రీనివాస్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు

పెందుర్తి : స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి లైబ్రేరియన్ బి సూర్యకళ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్వాతి రామకృష్ణ, శ్రీను, మధు, వెంకటరమణ పాల్గొన్నారు

విశాఖ కలెక్టరేట్ : విశాఖ కలెక్టరేట్ ఆవరణలో జాతీయ పతాకాన్ని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఎగురవేశారు. అనంతరం పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించారు. అనంతరం సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములు, తెలుగు తల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్సీ పి.రవీంద్రబాబు, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, డిసిసిబి చైర్మన్ కోలా గురువులు, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్ పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ పూలమాలలు వేసి అంజలి ఘటించారు. జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సురేష్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

విశాఖ నగర పోలీస్ కమిషనరేట్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డిసిపిలు కె.శ్రీనివాసరావు, కె.ఆనందరెడ్డి, జి.నాగన్న, ఎడిసిపిలు, ఎసిపిలు పాల్గొన్నారు.


నక్కపల్లిలో నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

కౌన్సిలర్‌ను దూషించడం తగదు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సమస్యలపై ప్రశ్నిస్తున్న జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్యను దూషించడం ఎంత వరకు సమంజసమని, తక్షణమే క్షమాపణ చెప్పాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర డిమాండ్ చేశారు. బుధవారం నర్సీపట్నం మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి, పలు సమస్యలపై మున్సిపల్ కమిషనర్ రవిబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య సమస్యలపై ప్రశ్నిస్తుంటే చైర్ పర్సన్ పిచ్చిదానివి అని అగౌరవపర్చడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే కౌన్సిలర్‌కు క్షమాపణ చెప్పాలని లేకుంటే ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ జనసేన అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, 9వ వార్డు కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య, గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు నాయకులు పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి- చీడికాడ:మండలంలోని ఖండివరం గ్రామంలో తులసి కళ్యాణమంపం వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యాన కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ మేనేజర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ, ఈ శిబిరం లో 146 మంది కంటి రోగులను పరీక్షలు చేయగా 65 మందికి కంటి ఆపరేషన్ ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి బస్సులో తరలించినట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ అప్తలమిక్ ఆఫీసర్ హరి చందన , క్యాంపు డిప్యూటీ మేనేజర్ అరుణ్ కుమార్, కో ఆర్డినేటర్ ప్రసాద్ పాల్గొన్నారు.

సన్మానిస్తున్న టిడిపి నేతలు

విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలోని పెద్దగుమ్మలూరు ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటారు. అండర్ 17 విభాగంలో వాలీబాల్‌లో హంస గాయత్రి, హై జంప్‌లో మాధురి, అండర్ 14 వాలీబాల్‌లో కే హరిణి, హైజంప్‌లో కీర్తి సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మేజర్ల నవీన్ రాజు మాట్లాడుతూ, క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఆరోగ్యాన్ని ఇస్తాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడారంగంలో రాణించడం ఆనందకరమన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినిలను సన్మానించి నగదు ప్రోత్సాహకం అందించారు.

తాగునీటి బోరు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కొత్త ఎల్లవరంలో గ్రామంలో నూతన మంచి నీటి బోరును బుధవారం వైసీపీ నాయకులు ప్రారంభించారు. మంచి నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న ప్రజల ఫిర్యాదు మేరకు జడ్పిటిసి సుర్ల గిరిబాబు తన నిధుల నుండి బోరు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ, మంచినీటి బోరు మంజూరు చేసినందుకు జడ్పిటిసి గిరిబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు.

బోరు ప్రారంభిస్తున్న నాయకులు

ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

695వ రోజుకు మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి -నక్కపల్లి: హెటిరో కొత్త పైపులైనుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. పైపులైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహాధర్నా 695వ రోజుకు చేరింది. బుధవారం మత్స్యకారులు ఆందోళన శిబిరం వద్ద పైపులైన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తామంతా సముద్రాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నామన్నారు. వేట సాగకపోతే పూట గడవని పరిస్థితిలో జీవనం సాగిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ జీవన విధాన్ని దృష్టిలో పెట్టుకొని పైపులైనుకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు గోసల స్వామి, కారే భులోక, సోమేష్, నూకరాజు, నానాజీ, కాశీ, అప్పారావు, మహేశ్, కోదండరాం, కోటి, సతీష్, అప్పలరాజు, రాజారావు, కాశీరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రవిబాబు

హాకీ పోటీలకు ఏర్పాట్లు చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 3 నుండి 5వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్ కు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ రవిబాబు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంఈఓ కే.నరేష్ ఆధ్వర్యంలో నక్కపల్లి, పాయకరావుపేట,ఎస్ రాయవరం, కోటవురట్ల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సుధూరు ప్రాంతాల నుండి వచ్చే హాకీ క్రీడాకారులకు వసతి సౌకర్యం, మౌలిక సదుపాయాలపై చర్చించారు. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.

చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎంపిపి

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి-రోలుగుంట: మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం రోలుగుంట మండలం కొమరవోలు ఆవలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో 50వేల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మత్స్యకారులకు జీవనోపాధికి మత్స్య శాఖ ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడి నాగమణి, జడ్పిటిసి రమణమ్మ, సర్పంచ్ సూరిబాబు పాల్గొన్నారు.

అనకాపల్లిని కరువు జిల్లాగా ప్రకటించకపోవడంపై

మెడకు ఉరితాళ్లతో రైతుల నిరసన

ఉరితాళ్ళు బిగించుకొని నిరసన తెలుపుతున్న రైతులు

ప్రజాశక్తి -నక్కపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అనకాపల్లిని కరువు జిల్లాగా ప్రకటించకుండా రైతులకు తీవ్ర ద్రోహం చేసిందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు విమర్శించారు. మండలంలోని ఉపమాక పంచాయితీ మనబాలవానిపాలెంలో బుధవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు నక్కపల్లిని కరువు మండలం గా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.రైతులు మెడకు ఉరితాళ్ళు బిగించుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు .ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం 7 జిల్లాలో 103 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిందని, దీనిలో అనకాపల్లి జిల్లాలో ఒక్క మండలం కూడా లేకపోవడం చాలా అన్యాయం అన్నారు. అనకాపల్లి జిల్లా లో 24 మండలాల్లో 18 మండలాల్లో తీవ్రంగా కరువు ఉందన్నారు. సాధారణ వర్షపాతం కంటే తక్కువగా వర్షం పడిందని,వేయాల్సిన పంటలు కంటే అత్యంత తక్కువగా పంటలను రైతులు వేసారని, అవీ కూడా ఎండిపోతున్నాయన్నారు. రైతులు వేలాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు కళ్ళెదుటే ఎండిపోతుంటే వాటిని కాపాడుకోవడానికి అవకాశం లేక, కాపాడుకోలేక తీవ్రంగా ఆవేదన చెందుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు ఎం.రాజేష్, రైతులు ఎం.సత్తిబాబు, ఎం.అప్పారావు, కె.ప్రసాద్, ఎం.చిన్నారావు, ఎం.యతిమాని, ఎం.శ్రీనావాస్ పాల్గొన్నారు.

పాలస్తీనాపై నరమేధాన్ని ఆపాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న అమానుష హత్యాకాండను ఆపాలని కోరుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు ఎల్ఐసి వద్ద గల అంబేద్కర్ విగ్రహం నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్టు పౌర ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఇజ్రాయిల్ కాల్పుల విరమణ ప్రకటించాలని ఈనెల 27న ఐక్యరాజ్యసమితి జనరల్ సమావేశం నిర్వహించి నిర్ణయించినప్పటికీ దాన్ని ఏమాత్రం ఖాతరు చేయకుండా కొనసాగించడాన్ని తీవ్రంగా ఖండించారు. అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ సాగిస్తున్న ఈ మారణ కాండను నిరసిస్తూ జరిగే శాంతి ర్యాలీలో సభలో విశాఖ ప్రజలు పాల్గొవాలని విజ్ఞప్తి చేశారు. భారత ప్రభుత్వం పాలస్తీనాకు మద్దతుగా నిలబడాల్సి ఉండగా తటస్థ వైఖరి చూపడం ఇజ్రాయిల్‌కి మద్దతులో భాగమేనని ఆక్షేపించారు. భారత ప్రభుత్వం తక్షణమే తన వైఖరిని విడనాడి పూర్తిగా పాలస్తీనాకు మద్దతు ప్రకటించాలని, సహాయ సహకారాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల వేదిక సమన్వయకర్త పి.చంద్రశేఖర్, భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మి, భారత నాస్తిక సమాజం జిల్లా నాయకులు రాం ప్రభు, డి.ప్రజ్ఞానంద్ తదితరులు పాల్గొన్నారు.

సెప్సిస్ నివారణపై అవగాహన

అవగాహన సదస్సులో పాల్గొన్న వైద్యులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఇండియన్ సొసైటీ ఆఫ్ క్రిటికల్ కేర్ మెడిసిన్, విశాఖపట్నం ఆధ్వర్యాన సెప్సిస్‌పై అవగాహన సదస్సును జిల్లా పరిషత్ జంక్షన్‌లోని అంకోసా హాల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షుడు డాక్టర్ ఓమ్‌రావు, డాక్టర్ కుచేలబాబు, డాక్టర్ రవీంద్రబాబు మాట్లాడుతూ, భారతదేశంలో ఏటా 30 లక్షల మంది సెప్సిస్ బారిన పడుతున్నారని, ప్రపంచంలో ప్రతి మూడు సెకన్లకు ఒకరు మరణిస్తున్నారని తెలిపారు. సెప్సిస్ ప్రాణాంతకం కాదన్నారు. చేతి పరిశుభ్రత, శానిటైజేషన్, వ్యాక్సినేషన్ వంటి ముందస్తు చర్యలతో, సెప్సిస్ బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. డయాలసిస్ వంటి ఖరీదైన వైద్యాన్ని నివారించవచ్చన్నారు. ప్రజలందరికీ ఈ వ్యాధిపై అవగాహన ముఖ్యం అన్నారు. దేశంలో సెప్సిస్ సంబంధిత మరణాలను తగ్గించడానికి, సరైన సమయంలో నిపుణులైన వైద్యుల వైద్య సాయం పొందితే దీనిని నివారించవచ్చని తెలిపారు. ఈ సదస్సులో ఐఎస్‌సిసియాం కమిటీ సభ్యులు డాక్టర్ టి.లక్ష్మీరాణి, డాక్టర్ సాయిరమాదేవి, డాక్టర్ మంజుల, డాక్టర్ అనురాధ, డాక్టర్ వరలక్ష్మి దివాకర్ల, డాక్టర్ సుశ్రీ, డాక్టర్ భవ్య, డాక్టర్ అనిత, డాక్టర్ సి.ఎం మోహన్ మహారాజ్, డాక్టర్ అచ్యుత్ గొందాడు, డాక్టర్ శ్రీనివాస్ మోణంకి, డాక్టర్ రవికృష్ణ తదితరులు వివిధ రకాల ఇన్ఫెక్షన్లు, పరీక్షలు, వాటికి వైద్యం గురించి అవగాహన కల్పించారు.

బ్యాన్ ప్లాస్టిక్ షార్ట్ ఫిలిం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ నిర్మించిన బ్యాన్ ప్లాస్టిక్ లఘు చిత్రం పోస్టర్‌ను నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ద్వారా జివిఎంసి ప్రాంగణంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎల్లాజీ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల జరిగే అనర్థాలను మూడు నిమిషాల నిడివితో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ నెల 3న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 6 గంటలకు ఈ చిత్ర ప్రదర్శన ఉంటుందన్నారు. నగరంలో కళాకారులు కళాపోషకులు వచ్చి ఈ చిత్రాన్ని వీక్షించాలని కోరారు. జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మ మాట్లాడుతూ నగరంలో ప్లాస్టిక్ బ్యాన్ చేసినప్పటికీ సింగల్ యూజ్ ప్లాస్టిక్ ఇంకా అక్కడక్కడ ఉపయోగిస్తున్నారని తెలిపారు. దీని అనర్థంపై చిత్రం నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు దిలీప్ కుమార్, అబ్దుల్లా అసరఫ్, అల్లుడుశ్రీను, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూస్ ప్లాస్టిక్ లఘు చిత్రం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జివిఎంసి కమిషనర్

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సర్వసిద్దిలో 'పొలంబడి'

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలోని సర్వసిద్ధి గ్రామంలో వై యస్ ఆర్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. సాగులో ఖర్చు తగ్గించు కోవడం, దిగుబడి పెంచడం, నాణ్యమైన పంటలపై ఎలమంచిలి సబ్ డివిజన్ సహాయ సంచాలకులు ఆర్.రవి ప్రకాష్ వివరించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో రైతులతో కలిసి క్షేత్ర పరిశీలన చేసి పలు సూచనలు అందించారు. వరిలో ఆకులు పసుపుగా మారడం, ఆకు ముడతకు సస్య రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి సౌజన్య, గ్రామ సర్పంచ్ గణేష్, రైతు సత్యనారాయణ, దినకర్ పాల్గొన్నారు

విజయసాయిరెడ్డివి బ్లాక్ మెయిల్ వ్యాఖ్యలు

- ఎంపీ జివిఎల్ నరసింహారావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వైసిపి రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి చేసినవి బ్లాక్ మెయిల్ వ్యాఖ్యలు మాదిరిగా ఉన్నాయని బిజెపి రాజ్యసభ సభ్యుడు జివిఎల్ నరసింహారావు ఆరోపించారు. విజయసాయిరెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం సాయంత్రం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బిజెపి మహిళా మోర్చ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురంధేశ్వరి మద్యం విధానంపై చేసిన ఆరోపణలకు వైసిపి సరైన సమాధానం చెప్పలేక అనుచిత వ్యాఖ్యలు చేయడం అవివేకం అన్నారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ విజయసాయి రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మద్యం వ్యాపారంలో రూ.30 లక్షల కోట్ల మేరకు అవినీతి జరుగుతుందని ఆరోపించారు. దీనిపై సిబిఐ విచారణకు వైసిపి సిద్ధపడాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘాట్ రోడ్డులో వ్యాను బోల్తా

ప్రజాశక్తి-అనంతగిరి:

అనంతగిరి ఘాట్ రోడ్ ఐదవ మలుపు సమీపాన కూరగాయల వ్యాను బోల్తా పడింది. అరకు నుండి విశాఖ రైతు బజార్ కు కూర కాయలు తరలిస్తున్న వ్యాను బుధవారం ఈ ప్రమాదానికి గురైంది.పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో డ్రైవరు ఊపిరి పీల్చుకున్నారు. మరో వ్యాను లో కూరకాయలను లోడ్ చేసి విశాఖ రైతు బజార్ కు తరలించారు.